MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :18 సంచిక: 9 రంగారెడ్డి మే 2020 పేజీలు : 36 వెల : రూ. 10/-





## కరోనా కల్లోలంలో టమాటా రైతుకు ఏపిమాస్ బాసట !

రికార్డ్ స్థాయిలో కొనుగోలు : ప్రాసెసింగ్‌కు సరఫరా !

ఏపిమాస్ , ఎం-టమాటా ఎఫ్ పి సి సాధించిన ఘనత!

## స్ఫూర్తి కిరీటం !



'రైతు మిత్ర ' సి ఎస్ రెడ్డి

## సంక్షోభంలో సర్వవిధ సహాయం !

- 18 రోజుల్లో వెయ్యి టన్నుల టమాటాల కొనుగోలు , ప్రాసెసింగ్‌కు సరఫరా
- 7000 కుటుంబాలకు ఉచితంగా నెలకు సరిపడ రేషన్ అందజేత
- 250 టన్నుల పండ్లు, కూరగాయలు వివిధ మార్కెట్లకు సరఫరా

## ఉచితంగా రేషన్ పంపిణీ !



హైదరాబాద్‌లోని మలక్‌పేట ప్రాంతంలో ...



హైదరాబాద్ మురికివాడలలోని పేదలకు రేషన్ పంపిణీ చేస్తున్న శ్రీమతి కళామణి ప్రభృతులు



ఏపిమాస్ ఆధ్వర్యంలోని పాడి, పంట ప్రాజెక్ట్ చే చిత్తూరు జిల్లాలో వలస కార్మికులకు పండ్ల కిట్ల పంపిణీ

Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో

# కరోనాపై పోరాటంలో ఏపిమాస్ సైన్యం !


















# మహిళా సాధికారత


సంపుటి 18 సంచిక 9



సంపాదకీయం

## సంక్షోభంలో సహాయం !

**క**రోనా అని పిలిచే కోవిడ్-19 మహమ్మారి మొత్తం ప్రపంచాన్నే అతలాకుతలం చేస్తున్నది. గతంలో ఎన్నో అంటువ్యాధులు, వైరస్‌లు వ్యాపించకపోలేదు. అయితే, అవి ఏవో కొన్ని ప్రాంతాలకో, దేశాలకో పరిమితమయ్యేవి. వ్యాధి సోకినవారు లేదా వారితో సన్నిహితంగా మెలగిన మరికొందరు చికిత్స తీసుకుంటే, స్వల్పకాలంపాటు తగిన జాగ్రత్తలు పాటిస్తే సరిపోయేది. సాధారణ జనజీవనానికి, సామాజిక దైనందిన కార్యకలాపాలకు అంతగా ఇబ్బంది వుండేది కాదు. కాని కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా జనజీవనాన్ని స్తంభింపజేసింది! గడపదాటనివ్వకుండా చేసింది. మనదేశంలో దాదాపు రెండు నెలలుగా సామాజిక జీవనమే లేకుండా పోయింది. ఒకరి నుంచి ఎందరెందరికో సోకడం, క్వారంటైన్‌లో రెండుమూడు వారాలు గడపవలని రావడం, ఏ క్షణంలో ఎవరినుంచి ఎవరికి సోకుతుందోనన్న ఆందోళన, అది మోగిస్తున్న చావుమేళం, తదితర భయోత్పాతం సంగతి అటుంచితే, దాదాపుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి,ఉత్పాదక రంగం,సేవల రంగం,వ్యాపార రంగం,పెట్టుబడుల రంగం...ఇలా అన్ని రంగాలూ చతికిలపడి పోవడంతో పేద,ధనిక తేడా లేకుండా అందరూ ఎన్నో కష్టనష్టాల పాలవుతున్నా , మరీ ముఖ్యంగా రెక్కాడితేకాని డొక్కాడని బడుగుజీవుల నెత్తిన ఏకంగా పిడుగుపడినట్టయింది ! ఒక రోజుకాదు, రెండురోజులు కాదు పని లేకుండా, సంపాదన లేకుండా వారాలు, నెలలు గడుస్తుంటే వారెలా బతకాలి? అయితే, మనిషి సంఘజీవి. సంఘమే మనిషి బలం! కరోనా కల్లోలం మరొకసారి ఈ జీవిత సత్యాన్ని నిరూపించింది.'మీ కష్టాన్ని పూర్తిగా తీర్చలేకపోయినా, కొంతలో కొంతైనా మీకు అండగా నిలవడానికి మేమున్నాం' అంటూ వదాన్యులు, వివిధరంగాల వ్యక్తులు, ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు, ఎన్నెన్నో ఎందరెందరో విడివిడిగా, కలిమిడిగా ముందుకు వచ్చి విరాళాలు యిచ్చారు;ఆర్థిక,ఆర్థికేతర సహాయం అందించారు. వనరులు సమకూరినా అవి బాధితులకు చేరే మార్గం కూడా లేని నిస్సహాయ స్థితి! ఈ విపత్తులో, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిన దుస్థితిలో, రెండు దశాబ్దాలుగా పేదలతో, అభివృద్ధి ఫలాలు సరిగా అందనివారితో కలసి పనిచేస్తున్న సంస్థగా తన వంతు పాత్ర నిర్వహించడానికి 'ఏపిమాస్' నడుంకట్టింది! ఒక విధంగా కాదు, అనేక రకాలుగా, వీలున్నంత ఎక్కువమందికి సహాయం అందేలా చూడడం ఏపిమాస్ లక్ష్యం. సహభాగస్వామ్య దాతృత్వ సంస్థలకు పరిస్థితి తీవ్రతను తెలియజేసి, వారిని ఒప్పించి, సత్వరం నిధులు అందించేలా చేసి, ప్రభుత్వాలతో సంప్రతించి బాధితులకు సహాయం అందించడానికి అవసరమైన అనుమతులు, అవకాశం వున్న రాయితీలు, మినహాయింపులు లభించేలా శ్రద్ధవహిస్తూ, వాహనాలను, ఇతర సాధనసంపత్తిని సమకూర్చుకుని, సొంత సిబ్బంది పరిపూర్ణ సహకారంతో బియ్యం, పప్పులు, వంటనూనెల వంటి నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు కొనుగోలుచేసి, వాటిని ఒక్కొక్క పేద కుటుంబానికి నెలరోజులకు సరిపడే నిర్ణీత పరిమాణంలో మూటలుగా కట్టి, వాటిని ఎంచుకున్న సహాయ కేంద్రాలకు చేరవేసి, ఎంపిక చేసిన కుటుంబాలవారికి ముందుగానే తెలియజేసి సిద్ధపరచి, పోలీసులు, స్థానిక పాలక వర్గాలకు సమాచారం అందించి, అందరినీ సమన్వయపరచుకుంటూ, కరోనా వ్యాప్తి నిరోధానికి సామాజిక దూరం వంటి సకల విధమైన ముందుజాగ్రత్తలు పాటిస్తూ, నెలరోజుల వ్యవధిలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 60 టన్నుల బియ్యం, 16 టన్నుల పప్పుల తోసహా 7,000 కుటుంబాలకు ఏపిమాస్ ఉచిత రేషన్, తదితర నిత్యావసర వస్తువుల సహాయం అందించగలిగింది. తాము పండించిన కూరగాయలను, పండ్లను లాక్‌డౌన్ కారణంగా రవాణాచేసే మార్గంలేక, పంటను కుళ్ళబెట్టుకోవలసిన దుస్థితితో తల్లడిల్లుతున్న రైతులను, అదే లాక్‌డౌన్ కారణంగా తమకు కూరగాయలు,పండ్లు లభించక ఇబ్బందిపడుతున్న వినియోగదారులను అనుసంధానపరుస్తూ, 250 టన్నుల కూరగాయలను, పండ్లను సేకరించి వివిధ మార్కెట్లకు ఏపిమాస్ సరఫరా చేయడం మరో విశేషం! వీటన్నిటిని మించి రైతులను సంఘటితపరచి, ఎఫ్ పి ఓ లు గా ఏర్పాటుచేసి, వాటిని సువ్యవస్థితంగా తీర్చిదిద్దడానికి సకల విధాలుగా మార్గదర్శకం వహిస్తున్న ప్రోత్సాహక సంస్థగా ఏపిమాస్ ఈ కరోనా కష్టకాలంలో ఎంతో బాగా పండిందనుకున్న పంటను అమ్ముకునే మార్గంలేక, కోత ఖర్చులు కూడా రాక పొలంలోనే వదిలివేసుకుంటున్న చిత్తూరు జిల్లా టమాటా రైతులకు బాసటగా నిలచి,దాతృత్వ సంస్థల తోడ్పాటుతో రవాణా ఖర్చులుకూడా భరించి, తగిన గిట్టుబాటు ధరకు వారు పంటను అమ్ముకునేలా చూడడం మరో విశేషం! నిజానికి ఇది సాధారణ విశేషం కాదు, ఒక రకంగా రికార్డు సాధించిన విశేషం! ఏపిమాస్ ప్రోత్సాహంతో ఏర్పాటైన 'ఎం-టమాట' అనే ఎఫ్ పి ఓ ల సమాఖ్య ద్వారా ఈ కొనుగోళ్ళు జరిపి, బెంగుళూరు సమీపంలోని 'సన్‌సిప్' వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమకు సరఫరా చేయగలిగాము. కేవలం 18 రోజుల స్వల్ప వ్యవధిలో 1002 టన్నుల టమాటాల సేకరణ, సరఫరా జరిగింది. అప్పటి వరకు ఒక సంవత్సరంలో వెయ్యి టన్నుల టమాటా విక్రయాలు జరపాలన్నది 'ఎం-టమాట' కల! ఊహించని విధంగా ఆ కల 18 రోజులలోనే నెరవేరింది. అదీ ఇంతటి కష్టకాలంలో ! రికార్డుల సంగతి ఎలావున్నా అటు నిరుపేదలకు, ఇటు నిస్సహాయ రైతులకు సహాయం చేయగలగడం ఒక గొప్ప సంతృప్తి! ఈ సంతృప్తికి మూలమైన దాతృత్వ సంస్థలకు, ప్రభుత్వాలకు, మా సిబ్బందికి, సహకరించిన అందరికీ ధన్యవాదాలు!



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

కావలసింది వేగం, తొందరపాటు కాదు

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- కుంగదీసిన కరోనా, ఆదుకున్న ఏపిమాస్ ! ...05
- ఆపత్కాలంలో అన్నదాతకు అండగా ఏపిమాస్! ...07
- మురికివాడల పేదలకు ఏపిమాస్ తోడ్పాటు ! ...11
- 5000 కుటుంబాలకు ఏపిమాస్ సహాయం! ... 13
- కరోనా సంక్షోభంలో రైతులకు 'ధీశాలి' సేవలు ...14
- ఓల్డ్ బోయినపల్లిలో ఏపిమాస్, స్వార్డ్ సహాయం ! ...15
- రైతు సంస్థల ద్వారా విత్తనాల సేకరణ ! ...16
- రైతులకు 'పాడి పంటలు' ప్రాజెక్ట్ తోడ్పాటు ! ...17
- 'ధరణి' ఎఫ్.పి.ఓ కూరగాయల అమ్మకం! ...18
- అనంత మండలాలలో ఏపిమాస్ సహాయచర్యలు ...19
- ఆపన్నులకు అండగా సంఘాలు, సమాఖ్యలు ! ...20
- బస్తీ వాసులకు సమాఖ్యల చేయూత ...22
- ఒంగోలులో సంఘాలచే సహాయ కార్యక్రమాలు ...24
- కరోనాపై అవగాహన, మాస్కుల పంపిణీ ! ...25
- భూమాత ఎఫ్‌పిఓ సేవా కార్యక్రమాలు ! ...26
- ఆజీవ ఎఫ్ పి ఓ, 'పీస్' సేవా కార్యక్రమాలు ...27
- కరోనాలో భారత ప్రతిష్ఠ పెంచిన విశిష్ట వ్యక్తులు ...28
- ఎస్ హెచ్ జి లకు మూడునెలల అదనపు వడ్డీ ...30
- జామసాగులో కొత్తదనం...ఆదాయం అధికం ...31
- అధిక దిగుబడినిచ్చే వంగడం ఎంటీయూ 1290...33


**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్లకు | : | రూ. 200 |
| మూడేళ్లకు | : | రూ. 280 |

| ప్రకటన చార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్స్ : 08413-403118/ 19/20,
ఫాక్స్ : 08413-403117 Web: www.apmas.org, E Mail: info@apmas.org


ఆనందానికి మూలం విజయం కాదు, కాని విజయ రహస్యం ఆనందమే !

# కుంగదీసిన కరోనా, ఆదుకున్న ఏపిమాస్ !

– జె వి క్రిష్ణమూర్తి

కరోనా మహమ్మారి దెబ్బకు జనజీవనం కకావికలమైంది. ఒక్కొక్కరిది ఒక్కొక్కరకమైన వేదన! సహజంగా బడుగు జీవులే ప్రధాన బాధితులు. వైరస్ బారినపడి, లేదా కరోనా సోకుతుందేమోననే భయంతో కొందరు, పూట గడవక ఇంకొందరు. తాము పండించిన పంటను కొనేవారు లేక మరికొందరు, గమ్యంచేరే వీలులేక కొందరు, ఇలా కరోనా అందరికీ ఏవో రకమైన కష్టనష్టాలను తెచ్చిపెట్టింది. లాక్‌డౌన్ తో జనజీవనం స్తంభించిపోయింది. ఒకరిగోడు మరొకరు పట్టించుకునే అవకాశమే లేదు. జరుగుబాటు వున్నవారి పరిస్థితి కొంత మెరుగు. పని లేదు, రాబడిలేదు, నేడు గడవడమెలా అని పేదలు కుమిలిపోతుంటే, ఆరుగాలం పండించిన పంట వెంటనే అమ్ముకోకపోతే కళ్ళెదుటే అది కుళ్ళిపోతుందని, ముఖ్యంగా కూరగాయలు, పండ్లు పండించిన రైతులు విలవిలలాడిపోయారు. ఇక కావలసిన నిత్యావసరాలు దొరకక వినియోగదారులూ ఇబ్బంది పడ్డారు. కనీవినీ ఎరుగని ఈ దుస్థితిలో అటు ప్రభుత్వాలతోపాటు 'సమాజం నాకేమిచ్చిందని కాక, సమాజానికి నేనేమిచ్చానని' బాధ్యతగా ఆలోచించిన కొందరు విశిష్ట వ్యక్తులు, కొన్ని సేవా సంస్థలు తమకు ప్రాణప్రమాదమని తెలిసీకూడా ఎంతో సేవాతత్పరతతో, అంకితభావంతో మానవసేవకు నడుం బిగించాయి.

వ్యక్తులను సంఘటితపరచి, పేదరికంతో సహా అన్ని సమస్యలను సంఘబలంతో, స్వయంసహాయ మహాసాధనంతో పరిష్కరించుకునేలా రెండు దశాబ్ధాలుగా సమాజంలో ప్రేరణ కలిగిస్తూ, మార్గదర్శకత్వం వహిస్తూ, అండగా నిలుస్తూ, సహాయకారి పాత్రను స్వార్ధరహితంగా, నిష్కళంకంగా, చిత్త శుద్ధితో పోషిస్తున్న ఏపిమాస్ ఈ ఘోర విపత్తులో సమాజసేవకు ముందుకు రాకుండా ఎలా వుండ గలుగుతుంది? పరోపకారం జీవనాడిగా కలిగిన ఆ సంస్థ, దాని సారథి శ్రీ సి ఎస్ రెడ్డి ఎలా మిన్నకుండ గలుగుతారు? అందుకే, మిగతా సమాజం కరోనా కల్లోలం కలిగించిన దిగ్భ్రాంతినుంచి కోలుకోకముందే ఏపిమాస్ మేలుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని తన కార్యక్షేత్రాల నలుదిశలా తన సహాయ హస్తాలను చాచింది. ఉభయ తెలుగు రాష్ట్రాలే కాదు, తన సేవాకార్యక్రమాలతో ముడిపడివున్న ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు మహానగరాలు కూడా ఈ సంక్షోభ సమయంలో ఏదోరూపంలో ఏపిమాస్ సహాయసహకారాలను అందుకున్నాయి.

ఎవరికి ఏ రకమైన సహాయం అవసరమో ఆ రకమైన సహాయాన్ని ఏపిమాస్ అందించింది. చేయడానికి పనులు లేక,చేతులో డబ్బులులేక, ఆకలికడుపుతో రగిలే నిరుపేదలకు, వలస కార్మికులకు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలలోని వారికి దాదాపు ఐదువేల మందికి నెలరోజులకు సరిపడా బియ్యం,పప్పుఉప్పు వంటి నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసింది. వీటితోపాటు వారి ఆరోగ్య సంరక్షణకోసం 'మాస్క్‌లు, శానిటైజర్లు, సబ్బులు, మహిళలకు నాప్‌కిన్స్ వంటివి కూడా సమకూర్చింది. ఈ ఉపద్రవ సమయంలో పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకుని, వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడానికి వీలుగా కొందరు పేదలకు ఉచితంగా ఐదారు రకాల పండ్లు పంచిపెట్టింది. కొనుగోలు శక్తి వున్న వినియోగదారులకు పండ్ల ప్యాకెట్లను తక్కువ ధరకే (కేవలం వంద రూపాయలకు) విక్రయించింది.


- **సేవలు అందించిన ప్రాంతాలు:** ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు; తెలంగాణాలో కామారెడ్డి, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం,యాదాద్రి జిల్లాలు
- **లబ్ధిపొందిన కుటుంబాలు:** 4915
- **లబ్ధిపొందిన రైతులు:** 699 మంది
- **వెలకట్టలేని సహాయపు ఆర్థిక విలువ:** కోటిరూపాయలను మించి

**రైతుబంధు**

ఇక రైతు బంధుపాత్రలో ఏపిమాస్ అద్వితీయమైన స్ఫూర్తిని, కార్యదక్షతను, సంఘటిత శక్తిని ప్రదర్శించింది. తాను, తన భాగస్వామ్య సంస్థలు, దాతృత్వ సంస్థల ప్రోత్సాహ సహకారాలతో పనిచేస్తున్న ఎఫ్ పి ఓలకు ప్రేరణ కలిగించి, కరోనా సృష్టించిన సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని, అటు స్వామికార్యం ఇటు స్వకార్యం సమర్థంగా నిర్వహించు కునేలా మార్గదర్శనం చేసింది. కుటుంబాలకు, సంస్థలకు నిత్యం అవసరమైన కూరగాయలను, పండ్లను ప్రభుత్వాల అనుమతితో సమీపంలోని మార్కెట్లకు చేరవేసి,విక్రయింపజేసి అటు రైతుకు, ఇటు వినియోగదారునికి అనుసంధానకర్తగా వ్యవహరించి వారి కష్టాలను తొలగించి గట్టెక్కించింది.

వీటన్నిటికి మించి చిత్తూరు జిల్లాలో టమాటా రైతును సకాలంలో ఆదుకున్న తీరు మరింత అభినందనీయం. చేలనిండా పంట విరగకాసింది. మంచి ఆదాయం వస్తుందని తమ కష్టాలు ఈ ఏడాదైనా కొంతవరకు గట్టెక్కుతాయని ఆశించిన టమాటా రైతు ఆశలపై లాక్‌డౌన్ పిడుగుపాటులా పడింది. నిల్వవుండే పంటకాదు. సకాలంలో అమ్ముకోకపోతే ఆదాయం కాదుకదా అంతా నష్టమే! ధర దారుణంగా పతనమైంది. అదే జిల్లాలో అలా తమ పంటను అమ్మే దారి లేక, కోతఖర్చులుకూడా వెళ్ళవని చేలోనే వదులుకున్న రైతులు ఎందరో వున్నారు. కాని ఏపిమాస్ తన నిర్వహణలోని ఎఫ్ పి ఓ ల పరిధిలో చక్కని ప్రణాళికతో సభ్య రైతులను చైతన్యపరచి, ప్రభుత్వంద్వారా అవసరమైన అనుమతులు సంపాదించి, బెంగుళూరు సమీపంలోని సన్ సిప్ వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ సంస్థతో సంప్రతించి, మార్కెట్‌లో ఇతరులు ఇచ్చే ధరకంటే మెరుగైన ధర చెల్లించేలా ఒప్పించి, కేవలం 18 రోజులలో వెయ్యి టన్నులకు పైగా టమాటాలను రైతులు అమ్ముకునేలా చేయగలిగింది. తోటి రైతులకు ఏపిమాస్ అందిస్తున్న తోడ్పాటును చూసి, తమనూ ఏపిమాస్ ఎఫ్ పి ఓ లలో సభ్యులుగా చేర్చుకోమని ఎందరో రైతులు ఒత్తిడి తెస్తున్నారంటే ఏపిమాస్ కార్యనిర్వహణ సామర్థ్యానికి, అంకితభావంతో చేసే సేవకు అంతకుమించిన నిదర్శనం మరేముంటుంది? శభాష్ ఏపిమాస్ ! ■

## అతడే ఒక సైన్యం ...



**తయారు చేసుకున్న సైన్యం తోడుగా ....**

ఒక పని సాధించాలంటే ఎవరికైనా ఎన్నో శక్తి యుక్తులు కావాలి. ఆటంకాలను అవకాశాలుగా మలచుకునే నేర్పు కావాలి. తాను ముందు నడిచి, తోటివారిని నడిపించగలిగే కలిమిడితనం, సహనశీలం కావాలి. అవసరానికి, సమయానికి అనుగుణంగా నలుగురినీ సమన్వయ పరచుకునే సామర్థ్యం కావాలి. ఎదురయ్యే సమస్యలను ముందే ఊహించి పరిష్కారాలను సిద్ధం చేసుకోగలిగిన ముందుచూపు కావాలి. ఇవన్నీ వుండి, త్రికరణ శుద్ధితో మెలిగేవారే అసలైన స్ఫూర్తి ప్రదాతలు కాగలుగుతారు. ఒక స్వచ్ఛంద సంస్థ ఇరవై ఏళ్ళుగా నిరంతర ప్రగతితో, తాను ఎంచుకున్న లక్ష్యానికి అనుగుణంగా ముందడుగు వేస్తూ, ఇతర సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తున్నదంటే నిస్సందేహంగా దాని పాలకవర్గం, దాని సారథి నిర్వహణ సామర్థ్యమే అందుకు కారణం! ఏపిమాస్ ఇన్నేళ్ళుగా నిరూపిస్తున్న ఈ వాస్తవం ఈ కరోనా కల్లోలంలో మరోసారి నిరూపితమైంది. మొత్తం ప్రపంచంలోనే ఎవరూ కనీవినీ ఎరుగని కల్లోలం! అందరికీ అది ఒక చేష్టలుడిగిన స్థితి! తనకుతాను ఏమి చేసుకోవాలో కూడా తెలియని సందిగ్ధ సందర్భం. కదలడానికి వీలులేదు. సాహసించి కదిలితే ఏం ముప్పు ముంచుకొస్తుందో? తామే ముప్పుకు మూలమవుతామేమో? ఇంతటి అయోమయ స్థితిలో సమస్య తీవ్రతను సదవగాహన చేసుకుని, తాను వ్యక్తిగతంగానే కాకుండా తన సంస్థ ద్వారా ఎన్నిరకాలుగా సహాయం చేయవచ్చునో అన్ని రకాలుగా సహాయం చేసిన అసలైన 'కార్యనిర్వహణాధికారి' ఏపిమాస్ సారథి శ్రీ సి ఎస్ రెడ్డి! సమయంలేదు. భాగస్వామ్య సంస్థలను, ప్రభుత్వ అధికారులను, సిబ్బందిని, క్షేత్ర స్థాయి కార్యకర్తలను సమన్వయ పరచుకోవడం ఒక సవాలు. తమకు సహకరించే దాతృత్వ సంస్థలను ఒప్పించి, మెప్పించి వారి సవాలక్ష ప్రశ్నలకు సముచితమైన వాస్తవిక సమాధానాలతో నిధులు సమకూర్చుకోవడం మరో సవాలు. అందించవలసిన సహాయ సామగ్రిని సకాలంలో తగిన విధంగా సిద్ధంచేయించడం, సమయం మించకుండా పంపిణీ చేయడం ఇంకొక సవాలు. రైతుల దుస్థితిని తప్పించడానికి సిబ్బందిని పరుగులు పెట్టించి యుద్ధప్రాతిపదికన టమాటాలను తరలించడం సామాన్యమైన విషయమా! పెద్ద చిన్న తేడా లేకుండా, హోదాలు, అధికారాలు మరచి, రేయింబవళ్ళు సేవలందించిన ఏపిమాస్ సిబ్బందికి సహస్రాభినందనలు! ఇంతటి మహత్కార్యాన్ని ఆదర్శంగా నిర్వహించిన చంద్రశేఖర రెడ్డి గారూ హ్యాట్సాఫ్ !

# ఆపత్కాలంలో అన్నదాతకు అండగా ఏపిమాస్!

## రికార్డు స్థాయిలో రైతులనుంచి 1,002 టన్నుల టమాట కొనుగోలు!

**- ఎన్.వినాయక రెడ్డి, ప్రహల్లాద, వాసుదేవరెడ్డి**

**కో**విడ్ 19 విశృంఖల విహారంలో యావత్ ప్రపంచం అతులాకుతలమవుతుండగా ప్రపంచానికి ఆహారాన్ని అందించడానికి అహర్నిశలు శ్రమిస్తున్న అన్నదాత పరిస్థితి వర్ణనాతీతం. అధిక ఉత్పత్తి వ్యయాలు, కూలీల కొరత, అనిచ్చిత మార్కెట్ ధరలు, మార్కెట్‌లలో దళారీ వ్యవస్థ మొదలగు సమస్యల మధ్య కొట్టు మిట్టాడుతూ పండించిన పంటలకు ఎప్పుడు లాభం వస్తుందో అని ఎగచూచే రైతన్నకు "మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు" కోవిడ్ 19 ప్రభావం సగటు రైతన్నల బ్రతుకులలో విపరీత ప్రతికూల ప్రభావం చూపిస్తూంది.

చిత్తూరు జిల్లా రైతులకు టమాట ప్రధాన కూరగాయల పంట. టమాట ధరలలో విపరీత పరిణామాలు సంభవించి ఒక్కొక్క సారి కనీస ధర కూడా లేక కాయలను కోయకుండా పొలంలోనే వదిలి వేసిన సంఘటనలు గతంలో కోకొల్లలు. టమాట సాగు ఒక జూదంగా మారింది. ఒక్కొక్కసారి పెట్టుబడి రాని స్థితి, మరొకసారి లాటరీ తగలవచ్చు.

అయినా చిత్తూరు జిల్లా రైతులు మాత్రం టమాట పంటపై మక్కువ కోల్పోకుండా చావో బ్రతుకో అని కేవలం టమాటపై ఆధారపడి సాగు చేయిస్తుంటారు. ప్రతి సంవత్సరం జనవరి త్రైమాసికంలో ధరలు బాగా ఉంటాయని భావించిన రైతులు, వేల ఎకరాలలో టమాట పంట వేశారు. ఎవరూ ఉహించని విధంగా కోవిడ్ 19 కారణంగా ప్రపంచ మానవాళి జీవితాలలో కోలుకోలేని పరిస్థితి ఎదురైంది. ప్రపంచ మానవాళికి ఆహారాన్నందించే రైతన్న ముఖ్యంగా టమాట రైతు పరిస్థితి చాలా అధ్వాన్నంగా తయారైంది.

**ఆశలను కుప్పగూల్చిన కరోనా :** భారత దేశంలోని ప్రధాన నగరాలలోను ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని హొటల్స్‌లో దాదాపు అన్ని కూరల్లో టమాట వేయడం అలవాటు. అందువలన టమాటకు విపరీతమైన గిరాకి వుండేది.

ప్రస్తుత కరోనా లాక్ డౌన్ కారణంగా చిన్న చితక హొటల్‌ల నుండి పెద్ద నగరాల లోని నక్షత్ర హొటల్‌ల వరకు మూత పడుటవలన టమాటకు గిరాకి పూర్తిగా తగ్గి రైతులు తమ పొలాలలో టమాటలు కోయలేని పరిస్థితి ఎదురైంది. ఒకవైపు విపరీతంగా

### టమాటాల కొనుగోళ్ల వివరాలు

- కొనుగోలుచేసిన టమాటాలు : 1002 టన్నులు
- కొనుగోళ్ళ విలువ : రూ. 35,08,764
- ఏపిమాస్ భరించిన రవాణా ఖర్చు : రూ. 7,44,500
- లబ్ధి పొందిన రైతులు : 478 మంది
- లబ్ధి పొందిన మహిళా రైతులు : 170 మంది
- లబ్ధి పొందిన పురుష రైతులు : 308 మంది
- కొనుగోళ్ళు జరిగిన మండలాలు : 08
  (కలికిరి, పలమనేరు, కురబలకోట, మదనపల్లె, వి కోట, నిమ్మనపల్లె, రామసముద్రం, వాల్మీకిపురం)
- భాగస్వామ్య రైతు సంస్థలు: 08
  (కలికిరి ఎఫ్ పి ఓ, కౌండిన్య ఎఫ్ పి సి, మర్యాదరాన్న పట్నం ఎఫ్ పి సి, కురబలకోట ఎఫ్ పి ఓ, వి కోట ఎఫ్ పి ఓ, నిమ్మనపల్లె ఎఫ్ పి సి, రామసముద్రం ఎఫ్ పి ఓ , వాల్మీకిపురం ఎఫ్ పి ఓ)

ఇతరుల మాదిరే నీవూ వుండాలనుకుంటే, అసలు నీవు వుండడమెందుకు ?

పండిన పంట, మరో వైపు మార్కెట్ లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు పంపించాలన్నా అక్కడ గిరాకీ లేక పోవడం, ఆదాయాలు లేక రైతు పరిస్థితి చాలా అధ్వాన్నంగా తయారైంది.

**ఎడారిలో ఒయాసిస్ లా ఏపిమాస్ :** ఇటువంటి విపత్కర పరిస్థితులలో రైతులకు ఆపన్న హస్తం అందించాలని చిన్న, సన్నకారు రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్న ఏపిమాస్, జర్మనీకి చెందిన జి ఐ జడ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారితో కలిసి సంయుక్తంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓ ల) లోని సభ్య రైతులకోసం కొన్ని ఉపశమన కార్యక్రమాలు చేపట్టింది. సభ్య రైతులు పండించిన టమాటలను రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా కొనుగోలు చేసి బెంగుళూరు సమీపంలో శ్రీనివాసపురంలోని 'సన్ సిప్' కంపెనీ వారికి అమ్మి సభ్య రైతులను ఆదుకోవాలని నిర్ణయించింది. 'సన్ సిప్' కంపెనీ వారు కూడా విపత్కర పరిస్థితులలో రైతులకు కొంత ఊరట నివ్వాలని, ప్రస్తుతం టమాట ధర బాగా తగ్గినప్పటికి రైతులకు కనీస ధర చెల్లించాలని నిర్ణయించడం మరికొంత ఓదార్పునిచ్చిన అంశం.



జర్మనీకి చెందిన జి ఐ జడ్ వారి ఆర్థిక సహాయంతో, ఏపిమాస్ టమాట రవాణా ఛార్జీలను పూర్తిగా భరించి రైతు తోట దగ్గరే కేజీ 3.50 చొప్పున కొనుగోలు చేసి శ్రీనివాసపురంలోని 'సన్ సిప్' కంపెనీ వారికి అందజేస్తున్నది..

చిత్తూరు జిల్లాలోని ఏపిమాస్ పని చేస్తున్న రామసముద్రం. పలమనేరు, వి.కోట, మదనపల్లి, నిమ్మనపల్లి, కురబలకోట, వాల్మీకి పురం, కలికిరి అనే 8 మండలాలలో నుండి టమాటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నది.

2020 ఏప్రిల్ నెల 9వ తేది నుండి టమాట కొనుగోలు ప్రారంభమై, ఇంకా ఈ కార్యక్రమము కొనసాగుతున్నది. ఏప్రిల్ నెల 30వ తేదీ వరకు 1002 టన్నులు కొనుగోలు చేసి, సన్‌సిప్ వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ కంపెనీకి సరఫరా చేయడం జరిగింది.

**చెల్లింపుల విధానం :** ఆర్థిక సమస్యలలో వున్న రైతులను ఆదుకోవాలన్న ఏపిమాస్ సంకల్పంలో భాగంగా, రైతు దగ్గర నుండి టమాటలను కొనుగొలు చేసిన నాలుగు రోజుల లోపే, రైతుకు చెల్లించవలసిన మొత్తాలను రైతు బ్యాంకు ఖాతాకు జమచేయడం జరుగుతున్నది. 'సన్ సిప్' కంపెనీ వారి నుండి రావలసిన మొత్తం కొంత ఆలస్యం అవుతున్నప్పటికీ, రైతులను త్వరగా ఆదుకోవాలన్న ఏపిమాస్ లక్ష్యంలో భాగంగా, ఏపిమాస్ తోడ్పాటుతో ఏర్పాటైన 'ఎం.టమాట రైతు ఉత్పత్తి దారుల సమాఖ్య' నుండి అడ్వాన్సుగా కొంత మొత్తం తీసుకొని మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థల రైతులకు చెల్లిస్తున్నారు. టమాట రవాణా ఛార్జీలను ఏపిమాస్ చెల్లిస్తున్నది.

**కచ్చితమైన తూకం :** సాధారణంగా టమాటలను క్రేట్స్ ప్రకారం మార్కెట్‌లో రైతులు అమ్ముతారు. క్రేట్‌లలో ఎక్కువ, తక్కువలు వుండవచ్చు, అందువలన ఏపిమాస్ ద్వారా కొనుగోలు చేసే టమాటలకు కేజీల చొప్పున డబ్బులు చెల్లిస్తారు. కావున, రైతు పొలం దగ్గరే క్రేట్లను తూకము సగటున ఒక క్రేట్‌లో ఎన్ని కేజీల టమాటలు వున్నాయో వారి ముందరే తూకం వేసి చూపించడం జరుగుచున్నది.

**ఎఫ్ పి ఓ ల వాహనాల వినియోగం:** ఏపిమాస్ ద్వారా ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో ఐదు సంస్థలు (రామసముద్రం, పలమనేరు, వి.కోట, మదనపల్లి, నిమ్మనపల్లి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ వారి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్ కే వి వై) పథకం క్రింద 75% సబ్సిడీతో కొనుగోలు చేసిన రవాణా వాహనాలను పూర్తి సామర్థ్యంతో టమాట రవాణా కొరకు వినియోగిస్తున్నారు. వీటితో పాటు మరికొన్ని వాహనాలను అద్దె ప్రాదిపదికన

తీసుకొని టమాట రవాణా చేస్తున్నారు.

**పారదర్శకత :** ఏపిమాస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్. రెడ్డి గారి నిర్దేశం మేరకు టమాట కొనుగోలు ప్రారంభం నుండి ఏపిమాస్ సిబ్బంది, ఎఫ్.పి.ఓల సిబ్బంది టమాట కొనుగోలు పూర్తిగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా చేపట్టడం వల్ల, రైతులకు చెల్లింపులు కూడా నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం వలన రైతులలో ఏపిమాస్ పట్ల, రైతు సంఘాల పట్ల నమ్మకం, గురి మరింత పెరిగింది. ఏపిమాస్ వివిధ వాట్స్ అప్ గ్రూపుల ద్వారా రైతులకు సమాచారం చేరవేయడం వలన, ఎఫ్.పి.ఓ ల ద్వారా చేపట్టిన కార్యక్రమాల సమాచారం దాదాపుగా సభ్యులందరికి చేరింది.

**గ్రామ రైతు సంఘాల భాగస్వామ్యం :** ఏపిమాస్ సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు ఎక్కువ మంది సభ్య రైతులకు వుపయోగపడాలన్న సంకల్పంతో పాటు ఈ బృహత్తర కార్యక్రమంలో గ్రామ రైతు సంఘాల భాగస్వామ్యం పెంచాలన్న ఆశయానికి అనుగుణంగా గ్రామ పంచాయతీల వారీగా రైతులను ఎంపిక చేసే బాధ్యతను గ్రామ రైతు సంఘం కార్యవర్గ సభ్యులకు రైతు మిత్రలకు అప్ప గించడం జరిగింది. గ్రామ రైతు సంఘం కార్యవర్గ సభ్యులు, రైతు మిత్రలు ప్రాధాన్యత ప్రకారం రైతులను ఎంపిక చేస్తున్నారు.

**సేకరణలో ఇబ్బందులు:**

- గ్రామాలలో టమాట దిగుబడి బాగా ఎక్కువగా వున్నందువలన మండలంలోని అనేకమంది రైతుల నుంచి కొనుగోలుకు తీవ్రమైన వత్తిడి వస్తున్నది
- సన్ సిప్ కంపెనీ వారు పూర్తిగా మాగిన కాయలను మాత్రమే తీసుకొంటారు. అక్కడక్కడ దోర కాయలున్నా వారు టమాట లోడును వెనక్కి పంపిస్తారు. టమాట కాయలను కోసి క్రేట్లలోకి పేర్చేటప్పుడు దోర కాయలు వేరుచేసి కేవలం మాగిన కాయలను మాత్రమే వేయాలి. కాని టమాటకు ధరలు లేక విసిగిపోయిన రైతులు దోర కాయలను వేరు చేయడానికి సిద్ధంగా లేరు. ఫలితంగా టమాట సేకరణలో పాల్గొంటున్న సిబ్బంది చాలా ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తున్నది.
- ఒకవైపు కరోనా మహమ్మారి ఉధృతం అవుతున్నా, కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటకు పోవద్దని వారిస్తున్నా, పోలీసు వారు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా, ఇటువంటి కష్ట కాలంలో రైతులకు అండగా వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేయాలన్న ఏపిమాస్ సి.ఈ.ఓ శ్రీ సి ఎస్ రెడ్డి గారి పిలుపు మేరకు ఏపిమాస్ సిబ్బంది శక్తి వంచన లేకుండా పని చేస్తున్నప్పటికీ సభ్య రైతులతోపాటు మిగిలిన రైతులందరి నుంచి సేకరించడంలేదని శాపనార్థాలకు, బెదిరింపులకు కొదవ లేదు.
- ప్రస్తుతం టమాట దిగుబడి విపరీతంగా వున్నప్పటికీ, మార్కెట్‌లో గిరాకీ లేకపోవడం, సన్సిప్ కంపెనీ వారు కొంతమేరకే కొనగలమని చెప్పినందువలన ఏపిమాస్ సిబ్బందిపై విపరీతమైన వత్తిడి పెరుగుచున్నది. ఒకవైపు రైతు సంఘాల ప్రతినిధులు, మరోవైపు ప్రజా ప్రతినిధులు, ఇంకోవైపు రాజకీయ నాయకులు ఏపిమాస్ సిబ్బందిపై మా కాయలు తీసుకోండి, మా వారి కాయలు తీసుకోండని విపరీతమైన వత్తిడి తెస్తున్నారు.
- రైతుల తోటల వద్దనే టమాట కాయలను కొనుగోలు చేయాలని ఏపిమాస్ సిబ్బంది శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. కాని కొంతమంది రైతుల పొలాల దగ్గరకు వాహనాలు వెళ్ళడానికి సరైన దారి లేనందువలన, టమాట బాక్స్‌లను రహదారి వరకు కొంత దూరం తెమ్మని చెప్పినపుడు, రైతులు సహకరించడం లేదు, వారి పొలాల వద్దకే లారీని తెమ్మని బలవంతం చేస్తున్నారు, ఫలితంగా ఆ దార్లలో లారీలు ఇరుక్కు పోయి, వాటిని బయటకు తీయడానికి చాలా ఇబ్బంది పడడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.
- సాధారణంగా రైతులు వారు పండించిన టమాటలను ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముతుంటారు. రైతులకు ఈ వ్యాపారస్తులకు మధ్య కొంతమంది మధ్యవర్తులు వుంటారు. వారే రైతు తోటల వద్ద నుండి కాయలను చిన్న చిన్న వాహనాలలో నింపుకొని వెళతారు.

అందులకు ఒక బాక్స్‌కు ఇంత అని కొంత కమీషన్ తీసుకుంటారు. కాని ఏపిమాస్ ద్వారా కొనుగోలు చేసే టమాటలలో ఎటువంటి కమీషన్ లేదు. అయినప్పటికీ కాయలను లోడ్ చేయుటకు కొంతమంది రైతులు సహకరించక పోవడం వలన రైతు ఉత్పత్తిదారుల సంస్థల వాహన డ్రైవర్లు, ఏపిమాస్ సిబ్బంది కూడా క్రేట్స్‌ను లోడ్ చేయడానికి చాలా ఇబ్బంది ఎదుర్కోవలసి వస్తున్నది.

- **బాక్స్‌ల కొరత :** మధ్య తరగతి రైతులవద్ద, కొంత జరుగుబాటు వున్న రైతుల వద్ద సొంత టమాట క్రేట్స్ వున్నాయి. వారు ముందుగా వారివద్ద వున్న బాక్స్‌లలో కాయలను కోసి, వాహనం వచ్చిన తరువాత బాక్స్‌లను సులభంగా మార్చుకోగలుగుతున్నారు. కాని పేద రైతులకు సొంతంగా బాక్స్‌లు లేని కారణంగా, ఒకరోజు ముందుగా బాక్స్‌లు ఇమ్మని ఏపిమాస్ సిబ్బందిని రైతులు అడుగుతున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులలో ఒకరోజు ముందుగా క్రేట్స్ ఇచ్చే అవకాశం లేదు. ముందుగా బాక్స్‌లు ఇవ్వలేనందున రైతులు ఇబ్బంది పడుతున్నారు.

పై సమస్యలు వున్నప్పటికిని ఏపిమాస్ సిబ్బంది ఎక్కడా పనిలో రాజీ పడకుండా ఏప్రిల్ నెల చివరి నాటికి రైతుల వద్ద నుండి 1002 మెట్రిక్ టన్నుల టమాటాలను సేకరించి సన్సిప్ కంపెనీ వారికి సరఫరా చేయడం ఒక అసాధారణ విజయం!

**పండ్ల కిట్ల అమ్మకం :** కోవిడ్ 19 ప్రభావిత ప్రాంతాలలో ప్రజలలో రోగ నిరోధక శక్తి పెంచడంకోసం కొనుగోలు సామర్థ్యం కలిగిన ప్రజలకు సి విటమిన్ కలిగిన ఆరు రకాల పండ్ల కిట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానశాఖ సహకారంతో ఒక్కొక్కటి కేవలం వంద రూపాయలకే విక్రయించడం జరిగింది.

మదనపల్లి, పుంగనూరు, వెంకటగిరి కోట, కురబల కోట, వాల్మీకి పురం, కలికిరి మొదలైన ప్రాంతాలలో చిరుఉద్యోగులకు, ఇతర కొనుగోలుదారులకు మొత్తం 1000 పండ్ల కిట్లను విక్రయించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో మదనపల్లె, పీలేరు శాసనసభ్యులు, ఉద్యానశాఖ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

**అరబిందో ఫార్మాచే కొనుగోళ్ళు:** కరోనాలో రైతుల కష్టాలను గమనించిన అరబిందో ఫార్మా లిమిటెడ్, అరబిందో ఫౌండేషన్ వారు మంచి ధరలు చెల్లించి చిత్తూరులో పండిస్తున్న 15 లక్షల విలువగల పండ్లు, కూరగాయలను రైతులనుంచి కొనుగోళ్ళు చేశారు. ఇంతే కాకుండా 2.5 లక్షలు వెచ్చించి, పీలేరులో 747 మంది పేదవారికి పప్పులు, ఉప్పు, వంటనూనె, సబ్బులు ఉచితంగా అందించారు. పరిస్థితి తీవ్రతను అరబిందో ఫార్మాలిమిటెడ్, అరబిందో ఫౌండేషన్ వారికి వివరించి వారు ఇలా సహాయం చేయడానికి ముందుకు వచ్చేలా చూడడంలో ఏపిమాస్ సి ఈ ఓ శ్రీ సిఎస్ రెడ్డి పాత్ర చాలా వున్నది.



**పాడి పంటల ప్రాజెక్ట్ ద్వారా సహాయం :** కరోనా ఉపశమన కార్యక్రమాలలో భాగంగా వాల్మీకిపురం, కురబలకోట మండలాల్లోని 750 మంది పేదలకు కూరగాయలు, పండ్లు ఉచితంగా పంచడం జరిగింది. పశువులు కూడా మేత లేక ఎండుతున్నందున ఎంపిక చేసిన 75 మంది పేద పాడి రైతులకు వరిగడ్డిని పంచారు. మదనపల్లెలో మొత్తం 325 మంది ప్రభుత్వ ఆసుపత్రి నర్సులకు, పారిశుధ్య కార్మికులకు, నిరుపేదలకు ఉచితంగా 6 రకాల పండ్ల కిట్లను, 400 కుటుంబాలకు 1600 మాస్కులను ఏపిమాస్ ఆద్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది.

లాక్‌డౌన్ పొడిగింపుతో పాటు ఈ కష్టకాలంలో రైతులను ఆదుకునే ఏపిమాస్ కార్యక్రమాలు కొనసాగుతూనే వున్నాయి, కొనసాగుతూనే వుంటాయి. ■

గతాన్ని తలచుకుని కుమిలిపోవడం కాదు, ఆ గతం నుంచి జీవిత పాఠాన్ని నేర్చుకోగలగాలి

# మురికివాడల పేదలకు ఏపిమాస్ తోడ్పాటు !

– భవాని. ఎల్

హైదరాబాదు నగరంలో కరోనా కల్లోలంలో ఇండ్లకే పరిమితమై, పనులు లేక, జరుగుబాటు లేక, రోజు గడవడం కష్టంగా మారిన మలక్‌పేట ప్రాంతంలోని మురికివాడలకు చెందిన 650 పేద కుటుంబాలకు నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను, ఆరోగ్య సంరక్షణ కిట్లను, కూరగాయలను ఏపిమాస్ సంస్థ 'అజీం ప్రేమ్ జీ' సంస్థ ఆర్థిక సహకారంతో ఏప్రిల్ 18,19, 20 తేదీలలో ఉచితంగా పంపిణీ చేసింది. ఈ మురికివాడల్లో నివసించేవారిలో చాలామంది రోజువారీ కూలీలు. కరోనా విపత్కర పరిస్థితులలో పనులులేక వారికి జీవనం అస్తవ్యస్తంగా మారి రోజు గడవడమే కష్టంగా తయారైంది. ముందు చూపుతో ఈ దుస్థితిని గ్రహించిన ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సిఎస్ రెడ్డి గారు వివిధ సంస్థలతో సంప్రదించి, వారి ఆర్థిక సహాయంతో



తెలంగాణాలో ఏపిమాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మార్పు' ప్రాజెక్ట్ ప్రాంతాలలోని పేద కుటుంబాలకు అండగా నిలవడానికి ఒక ప్రణాళిక రూపొందించారు.

**అంతా ప్రణాళిక ప్రకారం ...**

- 'అజీం ప్రేమ్‌జీ' సంస్థ నుంచి అందిన ఆర్థిక సహాయానికి తగినట్టుగా 650 పేద కుటుంబాలకు నెలవారీ నిత్యావసర సరుకులను, ఆరోగ్య సంరక్షణ కిట్లను, కూరగాయలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.
- 'మార్పు' ప్రాజెక్ట్ అమలు జరుగుతున్న మలక్‌పేట ప్రాంతంలోని పాత శంకర్ నగర్, కొత్త శంకర్ నగర్, శాలివాహన నగర్, భూలక్ష్మి హరిజనవాడలలో ఎంపిక చేసిన 650 పేద కుటుంబాలకు అప్పటికే ఏవైనా ఇతర సంస్థల నుంచి గాని, ప్రభుత్వంనుంచి గాని ఏమైనా సహాయం అందిందా అని ఆరోగ్య కార్యకర్తలచే లేదా మార్పు కార్యకర్తలచే పరిశీలించి ఎటువంటి సహాయం అందలేదని నిర్ధారించుకోవడంతోపాటు, ఆ కుటుంబాలకు ఎటువంటి సహాయం అవసరమో కూడా వివరాలను సేకరించడం జరిగింది.
- ఆ కుటుంబాలవారు తెలిపిన అవసరాలకు అనుగుణంగా ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను, ఆరోగ్య సంరక్షణ కిట్లను, కొద్ది రోజులకు సరిపడా కూరగాయలను కొనుగోలు చేసి ఒక్కొక్క కుటుంబానికి ఒక ప్యాకెట్ వంతున 650 ప్యాకెట్లను సిద్దం చేశారు.
- ప్రతి ప్యాకేజిలో బియ్యం : 15 కేజీలు, గోధుమపిండి: 2 కేజీలు, కంది పప్పు : 2 కేజీలు, నూనె : 2 కేజీలు, చింతపండు : అర కేజీ, బెల్లం : 1కేజీ, కారం: అర కేజీ, పసుపు :100 గ్రాములు, ఉల్లిపాయలు : 1కేజీ, ఆలు : 1కేజీ, ఇతర కూరగాయలు (టమోటా, మిర్చి, బెండ, వంకాయ, దోస, క్యాబేజీ , గోకర): 3 కేజీలు. బట్టల సబ్బులు: 2, డెట్టాల్ సబ్బులు:2 , మాస్కులు: 3, సానిటైజర్:1, శానిటరీ నాప్కిన్స్: 5 వుండేలా ప్యాకెట్లు సిద్దంచేశారు.
- ముందుగా పోలీసులు,మునిసిపల్ కార్పొరేషన్ వారి అనుమతి తీసుకుని. కుటుంబాల వారీగా టోకెన్లను తయారుచేసి, నంబరు, తేదీ వేసి, ప్యాకేజి వస్తువులను పంచడానికి అనువైన విశాలమైన స్థలాన్ని ఎంపిక చేసి, సామాజిక దూరం పాటించేలా ఏర్పాట్లు చేసి ఎంపిక చేసిన కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది.

- 18, 19 తేదీలలో పాత శంకర్‌నగర్, కొత్త శంకర్ నగర్‌లలో 450 కుటుంబాలకు 20 వ తేదీన శాలివాహననగర్, భూలక్ష్మి హరిజనవాడలో 200 కుటుంబాలకు స్థానిక కార్పోరేటర్, ఏపిమాస్ ప్రతినిధులు,వలంటీర్ల సహకారంతో పంచడం జరిగింది
- మణికొండలోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో పాకెట్లను తయారు చేయించారు. సరుకుల కొనుగోలు, పాకెట్ల తయారీ, పంపిణీ మొదలైన అన్ని కార్యక్రమాలలో ఏపిమాస్ సిబ్బంది పూర్తిగా పాలుపంచుకున్నారు.

**వారి దీవెనలు పులకింపజేశాయి**

మురికివాడలలోని పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీలో మమ్మల్ని భాగస్వాములను చేసినందుకు ఏపిమాస్ సంస్థ వారికి నాహృదయ పూర్వక ధన్యవాదాలు. ఇప్పటివరకు ఎవరూ తమను పట్టించుకోలేదని, ఇలా నెలకు సరిపడా సరుకులు ఇచ్చినందుకు మిమ్మలను అదేవుడు చల్లగా చూడాలని సహాయం అందుకున్న ఆ పేదలు నా నెత్తిమీద చేయిపెట్టి దీవిస్తుంటే ఎంతో ఉద్వేగంగా, సంతోషంగా అనిపించింది.

*– ధనమ్మ, లక్ష్మిబాయి సమాఖ్య అధ్యక్షురాలు,*
*సువర్ణ సంఘ సభ్యురాలు–శంకర్ నగర్*

**ఏపిమాస్ వారు నాకు అందించిన పుణ్యమిది**

ఓల్డ్ శంకర్‌నగర్, న్యూ శంకర్‌నగర్ రెండు ఏరియాలకు కలిపి జిహెచ్‌ఎంసి పార్క్‌లో నిత్యావసర సరుకుల ప్యాకెట్లు పంపిణీ చేశారు. పద్ధతిగా లైను నిలబెట్టి ఎలాంటి గొడవలు లేకుండా అందరికీ సరుకులు ఇచ్చినారు. ఆ సరుకులు తీసుకున్నవారి ముఖాలలో చెప్పలేనంత సంతోషం. ఎందుకంటే అప్పటివరకు వారికి ఎవరూ ఇలా సరుకులు ఇవ్వలేదు. 'ఒక నెలకు సరిపడా సరుకులు చాలా బాగా ఇచ్చినారు. చాలా బాగున్నాయి' అని వారు నా నెత్తి మీద చెయ్యి పెట్టి దీవెనలు యిస్తుంటే, అందరూ మెచ్చుకుంటుంటే ఆ ఆనందంతో నా కళ్ళలో నీళ్ళు వచ్చాయి. ఇదంతా శ్రీ సి ఎస్ రెడ్డి గారు, కళామణి గారు, పద్మావతి గారు, భవాని గారు నాకు కలిగించిన పుణ్యం.

*– శ్రీమతి పుష్ప, ఆరోగ్య కార్యకర్త, శంకర్‌నగర్*

**ధన్యవాదాలు**

ఏపిమాస్ వారికి ధన్యవాదాలు. ఇటువంటి పరిస్థితుల్లో నెలకు సరిపడా సరుకులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. *– నర్సింగ్, శంకర్‌నగర్*

**చేతులెత్తి మొక్కుతున్నా...**

'నేను సిద్దిపేట్ నుండి పనుల కోసం ఇక్కడికి వచ్చాను. నేను ఏడునెలల గర్భిణిగా వున్నపుడు నా భర్త మరణించాడు. రోజువారీ కూలీ చేసుకుని పొట్ట పోసుకుంటున్నాను. ఇంత కష్టంలో వున్నపుడు ఏపిమాస్ సంస్థ వారు నాకు అందించిన సహాయానికి వారికి చేతులెత్తి మొక్కుతున్నా. మాకు ఇంతవరకూ ఎవరూ ఎలాంటి సరుకులు ఇవ్వలేదు. నెలకు సరిపడా ఇంత నాణ్యమైన సరుకులు ఇచ్చినందుకు నమస్కారం.

*– స్రవంతి, భూలక్ష్మినగర్*

**పేదల ఆకలి తీర్చారు**

మురికివాడల ఎంపిక నిజంగా నిష్పక్షపాతంగా ఉంది. రెడ్ జోన్ ప్రజలు అక్షరాలా ఆకలితో బాధపడు తున్నారు. ఈ పేద ప్రజలకు సేవ చేసినందుకు దేవుడు మీ అందరినీ ఆశీర్వదిస్తాడు.

*– శ్రీమతి విజయ లక్ష్మి, పిడి, పట్టణ సమాజ అభివృద్ధి*

**ఎంతైనా అభినందనీయం**

రెడ్ జోన్‌లో మీ ప్రయత్నాల గురించి నేను రోజువారీ వార్తాపత్రికలో చదివాను. అవసరమైన వారికి కిట్ల పంపిణీలో కూడా తాను పాల్గొన్నానని స్థానిక కార్పొరేటర్ నాకు చెప్పారు. ఈ క్లిష్ట సమయాల్లో పట్టణ మురికివాడల నుండి వచ్చిన ఈ నిరుపేదలను గొప్ప హృదయంతో మీ సంస్థ చూసుకుంటుంది. ఇది నిజంగా గొప్ప పని . మీ ప్రయత్నాలు ఎంతో మెచ్చుకోదగినవి. ధన్యవాదాలు

*– డాక్టర్ వీణ, మెడికల్ ఆఫీసర్ – శాలివాహననగర్, మలక్‌పేట*

■

వున్నదానితో ఆనందించలేనివారికి ఎంత వున్నా ఆనందం వుండదు

# హైదరాబాద్‌లో 5000 కుటుంబాలకు ఏపిమాస్ సహాయం!

– బండ్ల వెంకటేష్, కిషోర్

హైదరాబాద్ నగరంలో లాక్ డౌన్ కారణంగా ఎక్కడి ప్రజలు అక్కడే ఉండిపోవడం, ఉపాధి దొరకకపోవడం, మురికివాడల్లో నివాసం ఉన్న పేదలు, రోజువారీ కూలీలు, నిర్మాణపు పని కూలీలు, ఇళ్ళల్లో పనిచేసేవారు మొదలగు రెక్కాడితేకాని డొక్కాడని పేదలకు లాక్ డౌన్ సమయంలో ఆకలి తీర్చుటకు ఏపిమాస్ దాతల సహాయంతో తనవంతు సహాయాన్ని తోడ్పాటును అందిస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా, పైన పేర్కొన్న వారే కాకుండా నగరంలోని వివిధ




ప్రాంతాలలోని మురికివాడల పేదలకు, వలస కూలీలకు, అనాధ శరణాలయాలకు, వృద్ధ ఆశ్రమాలకు, చేనేత కార్మికులకు సంబందించిన 5000 కుటుంబాలకు కూరగాయలు, పండ్లు, బియ్యము, పప్పుతో కూడిన కిట్లను వివిధ సేవాసంస్థల సహకారంతో ఏపిమాస్ ఉచితంగా పంపిణీ చేసింది.

నిత్యావసరాల కిట్‌లో బియ్యము–10 కేజీలు, కందిపప్పు–2 కేజీలు, గోధుమపిండి–2 కేజీలు, చింతపండు–1/2 కేజీ, కారం–200 గ్రాములు, పసుపు–100 గ్రాములు, వంట నూనె–2 లీటర్లు, కూరగాయలు–5 కేజీలు వుంటాయి. దీనితోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కోసం యిచ్చే కిట్‌లో 250 గ్రాముల బట్టల సబ్బులు–2, డెట్టాల్ స్నానపు సబ్బులు–2, మాస్కులు–3, శానిటైజర్–1, శానిటరీ నాప్కిన్స్–8 వుంటాయి, ఒక నెలకు సరిపడే సరుకులు, వ్యక్తిగత పరిశుభ్రత కిట్ ఒక్కొక్కటి సుమారు రూ. 1650 లు విలువజేస్తుంది. ఇలాంటి 815 కిట్‌లను మలక్‌పేట పరిధిలోని పాత శంకర్ నగర్, కొత్త శంకర్ నగర్ మురికి వాడల రెడ్ జోన్ ప్రాంత కుటుంబాలకు, మణికొండలోని పేదలకు, పంజాగుట్ట సమీపంలోని మణిపూర్ రాష్ట్ర వలస ప్రజలకు ఉచితంగా ఏప్రిల్ 18 నుండి 21 వరకు పంపిణీ చేయడం జరిగింది .




ఈ సేవా కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా హైదరాబాద్‌లోని మారి, భూమిక, అంకురం, స్వార్డ్, అభిహార, అవోవ్మాట్, ఎల్.ఎస్.ఎన్ ఫౌండేషన్, ఫోనిక్స్ మొదలగు సేవా సంస్థలు, పురపాలక అధికారులు, తెలంగాణా పోలీసు, స్థానిక సముదాయ సంస్థలు, స్వయంసహాయ మహిళా గ్రూపులు, యువక సంఘాల వలంటీర్లు, నివాస ప్రాంత సంక్షేమ సంఘాలు, ఏపిమాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాలు,పండ్లు, కూరగాయలు, వ్యక్తిగత పరిశుభ్రత కిట్లను హైదరాబాద్ నగరంలోని మేఫేర్ విల్లాస్, తెల్లాపూర్, కొండ్లకాయ, నాగోలులోని సాయినగర్, పీర్జాది గూడ మొదలైన వివిధ ప్రాంతలలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నిర్వహణలోని అనాధ బాలల ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలలో కూడా పంపిణీ చేయడం జరిగింది. లబ్ధి పొందినవారు తమకు ఈ కిట్లు ఒక నెల పాటు సరిపోతాయని, ఈ కష్టకాలంలో ఈ తోడ్పాటు అందించిన ఏపిమాస్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ■

# కరోనా సంక్షోభంలో రైతులకు 'ధీశాలి' సేవలు !

– డి.హరిలాల్, సి.ఈ.ఓ. ధీశాలి

**క**రోనా వైరస్ రోజురోజుకి అతివేగంగా విస్తరిస్తూ భారతరైతు మెడకు చుట్టుకొని రైతాంగ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నది. ఇప్పటికే గిరాకీ తగ్గి సరఫరా పెరగడంతో రైతు చెమటోడ్చి పండించిన పంటకు సరైన మద్దతుధర లేక అవస్థలు పడుతున్నాడు. ఇక ఈ కరోనా కల్లోలంలో ముఖ్యంగా కూరగాయలకు సంబంధించి రోజువారీ కూలీలు, పురుగు మందులు, రవాణా సౌకర్యాలు సరైన మద్దతు ధర అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నాడు. రైతులు తాము పండించిన పంటను అటు మార్కెట్‌కు



తరలించలేక ఇటు నిలువ ఉంచుకోలేక సతమతం అవుతున్నారు. కోల్డ్ స్టోరేజి సదుపాయం తగినంతగా అందుబాటులో లేనందున తమపంటలను తక్కువ ధరకు అమ్మడంకానీ, దళారులకు అమ్మడం కానీ, పారవేయడం కానీ జరుగుతున్నది. ఒకవేళ తనంతటతానే రవాణా సౌకర్యం కల్పించుకొని మార్కెట్‌కు తీసుకువెళ్లినా తగిన గిట్టుబాటు ధర లభించడంలేదు. రవాణా ఖర్చులు కూడా ఎక్కువ అవుతున్నాయి, పంట ద్వారా వచ్చే ఆదాయానికి మించి పెట్టుబడి, రవాణా, కూలీలకు ఖర్చులు ఎక్కువగా ఉన్నందున రైతు పంటను తన పొలంలోనే వదులుకోవడం జరుగుతున్నది.

పాడి రైతు విషయానికి వస్తే పశువుల దాణా లభించడం లేదు. ఒకవేళ లభించినా రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. పాలు సేకరించడానికి వ్యాపారస్తులు రావడం లేదు. రైతు తానే పాలు తీసుకుపోయి అమ్ముకుందామన్నా అవకాశంలేదు. లేదా తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. పాలన్నీ కూడా అమ్ముడుపోవడం లేదు. సరైన సదుపాయం లేక పాలను పారబోయవలసి వస్తున్నది. వేసవికాలం రావడంతో పశువులకు సరైన మేతకూడా లభించడంలేదు. ఈవిధంగా రైతులు రోజురోజుకి అప్పులలో కూరుకుపోతున్నారు.

పైన చెప్పిన సమస్యలను అధిగమించడానికి ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల, సంస్థ (ఎఫ్ పి సి) గ్రామీణ మహిళా మండలి ఆధ్వర్యంలో 12–మొబైల్ వ్యాన్‌లకు కోవిడ్–19 పర్మిట్‌ను జిల్లా – ఉద్యానవనశాఖ వారి సహాయంతో రైతులకు అందజేయడం జరిగింది.

ఈ కోవిడ్–19 పాస్‌ల ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాము పండించిన కూరగాయలను అన్ని గ్రామాలలో ఇంటింటి వద్ద, జిల్లా, మండల కేంద్రాలలోని మార్కెట్లలో విక్రయించి, హైదరాబాద్ మార్కెట్లకు సులభంగా సరఫరా చేసి అమ్ముకోగాలిగారు. ధీశాలి ఎఫ్ పి సి వారు 21-04-2020 వరకు రైతుల నుండి 22,24,170 రూపాయల విలువ గల మొత్తం 741.39 టన్నుల కూరగాయలను మార్కెట్ రేట్‌కు కొని, ఏపిమాస్ వారికి సరఫరా చెయ్యడం జరిగింది.

పాల ఉత్పత్తిని పెంచడం కోసం ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ 2,10,000 రూపాయల విలువగల మొత్తం 200 సంచుల పశువుల దాణాను కొనుగోలు చేసి, పశువులు ఉన్న రైతులకు గిట్టుబాటు ధరకు ఇంటి వద్దకే అందించారు. తద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందికి గురి కాకుండా, రవాణా ఖర్చులు కూడా లేకుండా సకాలంలో

నీ కోపం సమస్యల మీద చూపు, తోటివారిమీద కాదు ; సాకులు చెప్పడం కాదు, పరిష్కారం వెదుకు



పశువుల దాణాను అందుకుని, పాల ఉత్పత్తిని పెంచుకుని లాభపడ్డారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా నాణ్యతగల 100 టార్పాలిన్ కవర్లను 1,84,900 రూపాయలకు కోరోమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ నుండి కొనుగోలు చేసి, రైతులకు అదే ధరకు అమ్మడం జరిగింది. తద్వారా 80 మంది రైతులు లాభపడ్డారు. ఈ టార్పాలిన్ కవర్లు పంటలకు రక్షణగా రైతుకు ఉపయోగపడుతున్నాయి.

కోవిడ్-19 నియంత్రణలో భాగంగా ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ గ్రామీణ మహిళా మండలి ఆధ్వర్యంలో వలస కార్మికులకు (ఇటుక తయారీ కార్మికులకు), పేదలకు, ఒంటరి మహిళలకు, గ్రామ పారిశుధ్య కార్మికులకు, ధీశాలి వాటాదారులకు మాస్కులు, శానిటైజర్స్, పశువుల దాణా, కూరగాయలు, నిత్యావసర వస్తువులను పంపిణీ చెయ్యడం జరిగింది. ■

# ఓల్డ్ బోయినపల్లిలో ఏపిమాస్, స్వార్డ్ సహాయం !

– కామాక్షి కుమారి సి హెచ్

ఏపిమాస్,స్వార్డ్(ఎస్ డబ్ల్యు ఏ ఆర్ డి) సంయుక్త ఆధ్వర్యంలో ఓల్డ్ బోయినపల్లి కౌన్సిలర్ శ్రీ ముద్దం నరసింహయాదవ్ గారి సహకారంతో ఓల్డ్ బోయిన



పల్లిలోని వలస కార్మికులు, ఆటో డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులను గుర్తించి, వారికి బియ్యం, పప్పులు మొదలైన నిత్యావసరాలతో కూడిన కిట్స్ అందచేయటం జరిగింది.

ఈ సందర్భంగా అందరూ మాస్కులను ధరించి సామాజిక దూరం పాటిస్తూ నిత్యావసరాలను అందించటమే కాకుండా, కరోన వైరస్ వ్యాప్తిని ఎలా నిరోధించాలి, సమిష్టిగా పాటించవసిన జాగ్రత్తలను అందరికీ వివరించడం విశేషం. దాదాపు 100 కుటుంబాలకు ఈ సహాయాన్ని చేయడం జరిగింది.

ఓల్డ్ బోయినపల్లిలోని 'అమ్మ ఓల్డ్ ఏజ్ హోం'లో ఉంటున్న వృద్ధులకు కూడా నిత్యావసరాలను అందించడం జరిగింది. ■



చిన్న సమస్యకే నీవు చలించి కోపం తెచ్చుకుంటే, పెద్ద సమస్యలను ఎదుర్కొనే సత్తా నీకు లేదనే కదా!

# రైతు సంస్థల ద్వారా విత్తనాల సేకరణ !

– గోపాలరాజు – సి.రాజశేఖర్‌రెడ్డి

కరోనా మహమ్మారి మన దేశంలో ఫిబ్రవరి 2020 నుండి ప్రారంభమై మార్చి నెల నుండి విజృంభణ చేసి, ఏప్రిల్ నెలలో కరాళ నృత్యం చేస్తున్న నేపథ్యంలో రైతులు పండించిన పంట మార్కెటింగ్ చేయడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు సంస్థలు రైతులు పండించిన పంటను సేకరించి ప్రభుత్వ గోడౌన్‌లకు తరలించడం జరిగింది.



అనంతపురం జిల్లా నల్లమాడ మండలంలో ఏపిమాస్ సంస్థ సహకారంతో జి4 ప్రాజెక్టును 8 పంచాయతీలలో అమలు చేయడం జరిగింది. జి4 ప్రాజెక్ట్‌లో భాగంగా మండల స్థాయిలో ఉన్న 8 గ్రామ రైతు సంఘాలను కలిపి మండల స్థాయిలో 'నల్లమాడ మండల రైతు సమాఖ్య'గా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మండల సమాఖ్య మార్కెఫెడ్, నాఫెడ్ సహకారంతో 2020 ఫిబ్రవరి నుంచి రైతుల దగ్గర నుండి కందుల కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా 75 మంది రైతుల నుంచి 770 క్వింటాల్స్ కందులను జల్లెడ ద్వారా జల్లించి నాణ్యమైన కందులను సేకరించింది. రైతులకు క్వింటాల్‌కు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.5,800 ప్రకారం సేకరించారు. మొత్తం 770 క్వింటాల్స్‌కు రూ. 44,63,100/ రైతుల బ్యాంక్ ఖాతాకు నేరుగా మార్కెఫెడ్, నాఫెడ్ వారు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని రైతు సమాఖ్య ద్వారా చేయడం వలన రైతులకు కనీస మద్దతు ధర లభించడం, తూకాలలో మోసంలేకపోడం, కమీషన్ చెల్లించ వలసిన పని లేకుండా రైతులకు గిట్టుబాటు ధర కలిగేలా ఉపయోగపడింది. అదేవిధంగా శక్తి సంఘంలో ఉన్న సభ్యులకు కందులను జల్లెడ పట్టుట, గ్రేడింగ్ చేయుటవంటి ఉపాధి కల్పించడం జరిగింది. సమాఖ్య ద్వారా ఈ కార్య క్రమాన్ని చేయడం వలన సమాఖ్యకు రైతులకు చెల్లించిన మొత్తం మీద 5% సర్వీస్ ఛార్జస్ మార్కఫెడ్ నుండి వస్తుంది.

కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ సీడ్ సిస్టం ద్వారా 2019 రబీ సీజన్‌లో రైతులు పండించిన వేరుశెనగ కాయలను సేకరించి, 2020 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సబ్సీడీ రేటుతో రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది. 'నల్లమాడ మండల వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య' ద్వారా ఏపిమాస్ విత్తన కేంద్రం తరఫున నల్లమాడ మండలంలో 85 మంది రైతుల నుండి 900 క్వింటాళ్లు, పల్లెజీవం ఆధ్వర్యంలో ఆగళి, రొళ్ళ, గుడిబండ మండలాల లోని రైతు సంస్థల ద్వారా 98 మంది రైతుల నుండి 1200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలను సేకరించి ఏపీ సీడ్స్ వారి గోడౌన్‌లకు తరలించడం జరిగింది.

ప్రభుత్వం వేరుశనగ విత్తనం క్వింటాల్‌కు రూ. 6100 లు కనీస మద్దతు ధర ప్రకటించింది. ఈ విధంగా సీజన్ కు ముందుగానే విత్తన కాయలను సేకరించడం రాబోవు ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో విత్తనకాయలను పంపిణీ చేయడానికి ఎంతగానో తోడ్పడుతుంది. ఇక విత్తనకాయలను సేకరించి ఏపీ సీడ్స్ వారికి పంపినందుకు క్వింటాల్‌కు రూ.500 లు సర్వీస్ చార్జెస్ కింద రైతు సంస్థకు లభిస్తాయి. ■

# రైతులకు 'పాడి పంటలు' ప్రాజెక్ట్ తోడ్పాటు !

– లిఖిత

కరోనా కష్టకాలంలో రైతులను ఆదుకోవడానికి 'ఏపీమాస్' చిత్తూరు జిల్లాలోని వాయలపాడు, కురబలకోట మండలాలలో తాను నిర్వహిస్తున్న 'పాడి పంటలు' ప్రాజెక్ట్ ద్వారా ఈ రెండు మండలాల రైతులకు, బడుగు బలహీన వర్గాలవారికి వివిధ రకాలైన సేవా కార్యక్రమాలను చేపట్టింది.

ఇందులో భాగంగా, ఈ రెండు మండలాల్లోని ఎఫ్‌పిఓల ద్వారా టమాట రైతుల దగ్గరనుండి టమాటాలను కొనుగోలు చేసి సన్సిప్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ వారికి రవాణా చేసింది. దీనితో 56మంది టమాటా రైతులు తమ పంటలను ఎలాంటి నష్టం లేకుండా అమ్ముకోగలిగారు. దీనిలో 23మంది మహిళా రైతులు లబ్ధి పొందారు. ఈ ప్రయోజనాల కారణంగా 65 మంది కొత్త రైతులు ఎఫ్‌పిఓలో సభ్యులుగా చేరారు.

పాడి పరిశ్రమ చేసే రైతులకు లాక్ డౌన్ కారణంగా పశువుల దాణాకు కొరత ఏర్పడింది. ఈ సమస్యకు పరిష్కారంగా కడప, శ్రీకాళహస్తి , తమిళనాడు లోని సేలం నుండి అదనపు రవాణా ఖర్చులు లేకుండా పశువుల దాణా సరఫరా చేయబడింది. దీని ద్వారా 75 మంది పాడి రైతులకు సహాయం చేకూరింది.

ప్రాజెక్ట్ ప్రాంతాల్లో సాధారణ మార్కెట్లు అందుబాటులో లేనందున, ఆ గ్రామ పంచాయతీ పరిధిలో 750 కుటుంబాలకు 7 రకాల కూరగాయలు పంపిణీ చేశారు.

అధిక పోషకాలు కలిగిన కర్బూజ, బత్తాయి, ద్రాక్ష, జామ, నిమ్మ, టమోటా, క్యారెట్ వంటి 7 రకాల పండ్ల కిట్లను, 100 రూపాయల చొప్పున విక్రయించారు.

ప్రకాశం జిల్లా నుండి వచ్చిన బొంత తయారు చేసే కుటుంబాలకు, నెల్లూరు నుండి వచ్చిన బొగ్గు కార్మిక కుటుంబాలకు, కర్ణాటక నుండి వచ్చిన నర్సులకు, ఇనుప పనిముట్ల తయారు చేసే బీహార్ కుటుంబాలకు, ఉత్తర్‌ప్రదేశ్ నుండి వచ్చిన సర్కస్ సిబ్బందికి, ఒంటరి మహిళలకు, పేద కుటుంబాల వారికి ఈ పండ్ల కిట్లను అందజేశారు. నిమ్మనపల్లి, వాయలపాడు, పీలేరు, రామసముద్రం, అనంతపురంలలోని పండ్ల రైతుల నుండి సుమారు 7 టన్నుల సేకరించి, 200కు పైగా కుటుంబాలకు 200 కిట్లు పంపిణీ చేయడం వలన నేరుగా 1075 మందికి సహాయం అందింది.

ప్రాజెక్ట్ సమీప ప్రాంతాలకు చెందిన 400 కుటుంబాలకు 1600 మాస్కులను ఉచితంగా సరఫరా చేసి, వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించడం జరిగింది. మాస్కుల తయారీ, ఒక నిరుపేద కుటుంబానికి ఇవ్వడం వలన ఈ కష్టకాలంలో వారి జీవనోపాధికి తోడ్పడింది.

ఈ కార్యక్రమాలకు పీలేరు నియోజకవర్గ ఎంఎల్ఏ శ్రీ చింతల రామచంద్రా రెడ్డి గారు, ఉద్యానవన విభాగం హెచ్‌ఓ, ఏడి, తగిన సహకారం అందించారు. ఎఫ్‌పిఓ పాలకవర్గ సభ్యులు , ఏపిమాస్ సిబ్బంది శ్రీ వినాయకరెడ్డి, శ్రీ వరప్రతాప్, శ్రీ అబ్దుల్ ఖాదర్, శ్రీ నారాయణస్వామి, పద్మజ, మస్తానీ, శ్రీ నారాయణరెడ్డి, ఏపీ సచివాలయం సిబ్బంది ఈ కార్యక్రమాల నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. ■



నీవు బిర్రబిగుసుకుని చేతులు ముడుచుకుంటే, నీతో చేతులు కలిపేవారెవరుంటారు ?

# 'ధరణి' ఎఫ్.పి.ఓ కూరగాయల అమ్మకం!

- జి. శ్రీనివాస్

తెలంగాణలోని కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలంలో ఏర్పాటు చేసుకున్న ధరణి ఎఫ్.పి.ఓ రైతు సభ్యులకు వివిధ రకాలైన సేవలందిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతూ ఉంది.

ప్రస్తుత కోవిడ్-19 లాక్ డాన్ సమయంలో ఎఫ్.పి.ఓ లో ఉన్న వారి సభ్యులకు కరోన వైరస్ గురించి పాటించవలసిన తగు జాగ్రతల గురించి అగగాహన కల్పిస్తూ ఉంది.



ముఖ్యంగా సామజిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని, చేతులను ఎప్పటికప్పుడు శానిటైజర్ ద్వారా చేసి హైదరాబాద్‌లో ఏపిమాస్ వారి అధ్వర్యంలో కూరగాయల అమ్మకం చేయటం జరిగింది.




రెండు దపాలుగా కూరగాయలను పంపినారు. వాటి వివరాలు.

- 31-03-2020 వ తేదీ కొనుగోలు : 19 **మంది రైతుల వద్ద నుంచి** 2586 కిలోల కూరగాయలు కొనుగోలు ఇందుకోసం ఏ.పి.మాస్ కు అరబిందో ఫార్మా ఆర్థిక సహకారం అందించింది.
- 8-04-2020 వ తేదీ కొనుగోలు: 26 **మంది రైతుల వద్ద నుంచి** 2735 కిలోల కూరగాయలు కొనుగోలు. మారి, అంకురం సంస్థ, పిర్జదిగూడ, నగరపాలక సంస్థ స్లమ్స్ కోసం.

పైన తెలిపిన విధంగా 45 మంది రైతుల వద్దనుండి దాదాపు 5320 కేజీల కూరగాయలను ఆయా ప్రాంతానికి పంపిణీ చేశారు. ఇలాంటి లాక్ డాన్ సమయంలో కూడా ఏపిమాస్ వారికి ధరణి ఎఫ్.పి.ఓ రైతుల వద్ద నుండి కూరగాయలను కొన్నందుకు రైతులకు చాలా లాభం వచ్చింది ఎఫ్.పి.ఓ కు కూడా కమిషన్ వచ్చింది.

ఇంతగా రైతులను ఆదుకుంటున్న ఏపిమాస్ సంస్థకు ధరణి ఎఫ్.పి.ఓ సభ్యులు ఎంతగానో కృతజ్ఞతలు తెలిపారు. ■

కుతంత్రంతో నీ వెంట నడిచే మిత్రుని కంటె, దగ్గరకు చేరనివ్వకున్నా నిజాయతీ పరుడైన శత్రువు మేలు

# అనంత మండలాలలో ఏపిమాస్ సహాయ చర్యలు !

– గోపాలరాజు





కరోనా మహమ్మారిపై సామాన్య ప్రజానీకానికి అవగాహన కల్పించాలని, పేదలకు, వలస కూలీలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో 'క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్' (సిఎస్‌విపి) ద్వారా అనంతపురం జిల్లా నల్లమాడ, గుడిబండ మండలాలలో ఏపీమాస్ సహాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 800 పేద కుటుంబాలకు మాస్క్‌లు, డెట్టాల్ సబ్బులను పంపిణీ చేయడం జరిగింది. ప్రాజెక్ట్ పరిధిలోని పది గ్రామాలలో కరోనా గూర్చి అవగాహన కార్యక్రమాలను ప్రాజెక్ట్ నిర్వహించింది.

వ్యవసాయ పనులు చేసేటపుడు, కూలీ పనులు చేసేటపుడు, ఉపాధి పనులు చేసేటపుడు, మార్కెట్‌లో కూరగాయలు, సరుకులు కొనుగోలుచేసి ఇంటికి తీసుకు వచ్చినపుడు ఇంటి బయట కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుగుకొని ఇంట్లోకి వెళ్ళాలి. అరచేతులతోపాటు మణికట్టు నుండి మోచేతి వరకు చేతులను సబ్బుతో ఇరవై సెకనుల పాటు శుభ్రంగా కడగాలని ప్రదర్శనా రూపంగా చూపడం జరిగింది. మార్కెట్ నుండి తీసుకు వచ్చిన కూరగాయాలు, సరుకులు వెంటనే వాడకుండా మరుసటి రోజు వాడాలి.

ఒకవేళ వెంటనే వాడాలంటే కూరగాయలను, ఆకు కూరలను ఉప్పు నీళ్ళతో బాగా కడిగి వాడాలి. కూరగాయలు తరిగిన వెంటనే చేతులను సబ్బుతో కడగాలి. బయట పనులకు వెళ్ళినపుడు తప్పక సామాజిక దూరం పాటించాలి. మాస్కులు విధిగా వాడాలి. మాస్క్‌ను ఒక నిమిషం వాడినా, కొన్ని గంటలు వాడినా ప్రతి రోజూ సబ్బుతో కడిగి, చివరగా వేడి నీటిలో ముంచాలి లేదా ఎండలో ఒక గంట పాటు ఎండనివ్వాలి. తరచూ నీరు బాగా తాగుతుండాలి.

గ్రామాలలోని నిరుపేదలను, మహిళా యాజమాన్య కుటుంబాలను, వికలాంగులను, దీర్ఘకాలిక రోగులున్న కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వం ఇచ్చే ఉచిత సరుకులతో పాటు ప్రాజెక్టు ద్వారా వేరుశెనగ పప్పు-1 కేజీ, వేరుశెనగనూనె-1 కేజి, కొర్రలు-2 కేజీలు, చక్కెర-1 కేజీని ఒక పోషకాహార కిట్‌గా చేసి 260 గుర్తించిన నిరుపేద కుటుంబాలకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.

గ్రామాలలోని 272 మంది పేద పాడి రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున 544 బస్తాల పశువుల దాణాను 75% సబ్సిడీతో అందజేశారు. బస్తా అసలు ధర రూ.950 చొప్పున 75% సబ్సిడీతో 544 బస్తాలకు రూ. 3,87,600 ప్రాజెక్టుద్వారా పాడిరైతులు లబ్ధిపొందారు.

ఎండలు ముదరడంతో జీవాలకు త్రాగునీటికోసం మూడు గ్రామాలలో పశువుల నీటి తొట్టెలలో నీరు పెట్టడానికి రైతులతో మాట్లాడి ఒప్పించి నీరు పెట్టించడం జరుగుతున్నది. ■

నిన్ను చూసి చిరునవ్వులు చిందించే వారంతా నిన్ను గుండెల్లో పెట్టుకునే స్నేహితులనుకోకు

# ఆపన్నులకు అండగా సంఘాలు, సమాఖ్యలు !

**– డాక్టర్. ఎం.నాగిరెడ్డి**

**క**లియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి నెలవైన తిరుపతి పట్టణంలో 4523 స్వయం సహాయ సంఘాలు (ఎస్ హెచ్ జి లు), 161 వార్డు సమాఖ్యలు (ఎస్ ఎల్ ఎఫ్), నాలుగు పట్టణ సమాఖ్యలు (టి ఎల్ ఎఫ్) మెప్మా ఆధ్వర్యంలో పొదుపు, అప్పుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి, ఈ సంఘాలే కాకుండా పట్టణంలో ప్రభుత్వ సహకారం లేకుండా తమ సొంత యాజమాన్యంలో ఎస్ పి ఎం ఎస్ 500 సంఘాలు, ఆర్ ఎ ఎస్ ఎస్ 1800 సంఘాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంఘాలలో సభ్యులుగా ఉన్న కుటుంబాలవారు తమ జీవనోపాధులకు తిరుమల కొండ మీద ఆధారపడి, దేవుని పటాల తయారీ, స్టోన్ వర్క్, పండ్ల వ్యాపారాలు, కాఫీ, టిఫిన్ హెూటల్స్, రోజువారీ కూలీ పనులు, బేల్దారి పనులు, ఆటో, ఇతర రవాణా సాధనాల నిర్వహణ వంటి జీవనోపాధులతో జీవనం సాగిస్తున్నారు.



ప్రతి రోజూ ఇతర ప్రాంతాల నుండి దేవుడి దర్శనం నిమిత్తం వచ్చే వేలాదిమంది భక్తులతో తిరుపతి, తిరుమల నిత్యం రద్దీగా వుండి ఉపాధికి లోటు లేకుండా వుండేది. అందుకే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనుండి జీవనోపాధి కోసం ఇక్కడకు వస్తుంటారు.

అయితే, ప్రపంచాన్నంతటిని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కోవిడ్ -19 ఉపద్రవం కారణంగా, దైవదర్శనాలు నిలిచిపోయి, ప్రజలందరూ స్వీయ గృహ నిర్బంధానికి పరిమితమయ్యే సరికి వారి ఆదాయ వనరులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వాలకు ఇదో పెద్ద సవాలుగా మారింది. ఇటువంటి తరుణంలో సంఘాలు, సమాఖ్యలు తామున్నామంటూ, రెక్కాడితేకాని డొక్కాడని ఈ పేదలను ఆదుకోవడానికి సామాజిక కార్యక్రమాలతో ముందుకొచ్చాయి.

**కరోనాపై అవగాహన కార్యక్రమాలు :** ఎస్ ఎల్ ఎఫ్ సభ్యులు వారి ప్రాంతాల యందు ఆశా, ఎ ఎన్ ఎమ్, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది సహకారంతో కరోనా సోకకుండా పాటించవలసిన శుభ్రత, వ్యక్తుల మధ్య భౌతిక దూరం, బయటికి పోకుండా ఇంట్లోనే వుండడాన్ని గురించి అవగాహన కలిగించాయి.

**టి టి డి అన్న ప్రసాదం పంపిణీ :** తిరుమల, తిరుపతి దేవస్థానం (టిటిడి) పరిపాలనా భవనంలో పులిహెూర, సాంబార్ అన్నం, పెరుగన్నం తయారుచేసి తమ వాహనాల ద్వారా ఆ ఆహార పదార్థాలను టిటిడి పేదల ప్రాంతాలకు చేరవేస్తుంది. అక్కడి ఎస్ ఎల్ ఎఫ్ లీడర్లు ఆ అన్నప్రసాదాన్ని మధ్యాహ్న, సాయంత్రాలలో ప్రతి ఇంటి దగ్గరకు చేరవేసి, జనం గుంపులుగా చేరకుండా, క్రమశిక్షణతో, ఆహార పదార్థాలు వృధా కాకుండా సరపరా చేస్తున్నారు.

**రేషన్ సరుకుల పంపిణీకి సహకారం:** ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత బియ్యం, కందిపప్పును తీసుకోవడానికి ప్రజలందరూ ఒకేసారి గుంపుగా వెళ్ళకుండా, టోకెన్ పద్ధతి ఏర్పాటుచేసి రోజూ నిర్దిష్ట సమయంలో, భౌతిక దూరం పాటిస్తూ రేషన్ సరుకులు తీసుకునే విధంగా పంపిణీకి



సహకరిస్తున్నారు.

**హెల్త్ సర్వే :** మెప్మా ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్ళి, హెల్త్ సర్వే నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వారిని గుర్తించి, వారి వివరాలను ప్రభుత్వానికి పంపి, వారికి వైద్య పరీక్షలు జరిగేలా చూస్తున్నారు.

**నిరాశ్రయులను వసతి గృహంలో చేర్పించుట :** గుడుల దగ్గర, రూయా హాస్పిటల్‌లో, రహదారుల పక్కన, బస్సు స్టాండ్లలో, రైల్వే స్టేషన్ల దగ్గర తలదాచుకొనే ఇల్లు లేని నిరాశ్రయులను గుర్తించి, వారిని పట్టణములో మెప్మా సహకారముతో నడుస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పిస్తున్నారు. ఈ వసతి గృహంలోని వారికి మూడు పూటల ఆహారం, వినోద కార్యక్రమాలు, ధ్యానం మొదలైనవి వుంటాయి.

**వీధి వ్యాపారులను గుర్తించుట :** పట్టణంలో తోపుడు బండ్లలోను, బుట్టలతోను పండ్లు, కూరగాయలను అమ్మేవారిని గుర్తించి, వారి వివరాలను మెప్మా వారికి యిచ్చారు. రైతులు పండించిన పండ్లను, కూరగాయలను ఈ వీధి వ్యాపారుల ద్వారా అమ్మే ఏర్పాట్లు చేస్తున్నారు.

**అంగన్ వాడీలకు సహకారం :** గర్భిణులకు, బాలింతలకు అంగన్ వాడీల ద్వారా అందిస్తున్న రోజువారి ఆహార పదార్థాలను, సరకులను వాళ్ళ ఇండ్లకు సరఫరా చేయడానికి అంగన్‌వాడీ సిబ్బందికి సహకరించి , అర్హులైన వారందరికీ సక్రమంగా, సకాలంలో పోషకాహారం అందే విదంగా ఎస్ ఎల్ ఎఫ్ సభ్యులు శ్రద్ధవహిస్తున్నారు.

'శ్రీ పద్మావతి అభ్యుదయ మహిళా సంఘం' తరపున వారు పని చేస్తున్న ప్రాంతాల్లో 805 పేద కుటుంబాలను సంఘాల ద్వారా గుర్తించి వారికి ఒక్కొక్క కుటుంబానికి రూ. 1000/- ఆర్థిక సహకారం అందించడానికి చర్యలు తీసుకొన్నారు. ఈవిధంగా సంఘాలు సమాఖ్యలు పొదుపు, అప్పులకే పరిమితమయ్యాయనే నింద సరికాదని నిరూపిస్తూ, విపత్కర పరిస్థితిలో సామాజిక బాధ్యత వహించి, కరోనా మహమ్మారి దుష్ప్రభావాన్ని తగ్గించడానికి సంఘాలు సమాఖ్యలు ఐకమత్యంతో ముందడుగు వేస్తున్నాయి. ■

## వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునే చిట్కాలు !

- ప్రతి రోజూ గోరువెచ్చని నీళ్లు తాగాలి.
- పసుపు, జీలకర్ర, ధనియాలు, వెల్లుల్లి తప్పకుండా వంటల్లో ఉండేలా చూసుకోవాలి.
- తులసి, దాల్చిన చెక్క, మిరియాలు, శొంఠి మిశ్రమంతో కూడిన కషాయం రోజుకు ఒకసారి రెండు సార్లు తాగాలి.
- ఒక గ్లాసు వేడి పాలలో అరస్పూను పసుపు వేసి రంగరించి తాగాలి. ఎన్నో ఏళ్లుగా, వ్యాధి నిరోధక శక్తి పెంచడంలో ఇది తిరుగులేని చిట్కా.
- ఉదయం, సాయంత్రం కొన్ని చుక్కలు నువ్వులనూనె, కొబ్బరినూనె, లేదా నెయ్యి ముక్కులో వేసుకోవాలి.
- ఒక టేబుల్ స్పూను నువ్వుల నూనె లేదా వంట కోసం ఉపయోగించే కొబ్బరినూనె నోట్లో వేసుకుని రెండు మూడు నిమిషాల పాటు పుక్కిలించాలి. ఆ తర్వాత వేడినీళ్లతో నోటిని శుభ్రపరుచుకోవాలి. ఇలా రోజుకు ఒక్కసారి కానీ రెండు సార్లు కానీ చేయాలి.

అందుబాటులో ఉంటే ఓ టేబుల్ స్పూన్ చ్యవన్ ప్రాష్ మిశ్రమాన్ని ప్రతిరోజు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి ఇనుమడిస్తుంది. మన ఇంట్లో దొరికే వాటితో వ్యాధి నిరోధక శక్తి ఎలా పెంచుకోవచ్చునో తెలిపే ఈ చిట్కాలను ఈ కరోనా కల్లోలంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచించింది. ■

దూకుడుగా వుండడం సాహసం కాదు, జంతు లక్షణం ; ఆలోచనలో చురుకుదనమే అసలైన సాహసం

# బస్తీ వాసులకు సమాఖ్యల చేయూత

**- ఎ. భవాని, జిహెచ్ఎంసి**

**క**రోనా.. కరోనా.. ఎక్కడ చూసినా ఈ పదం ప్రతి నోటా భయంతో వినపడుతున్నది. ప్రస్తుతం కరోనా వైరస్ వల్ల లాక్ డౌన్ విధించడంతో కార్మికులు తమ రోజువారీ అవసరాల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా కార్మికులు, రోజువారీ కూలీలు పనులు లేక నానా అవస్థలు పడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఏపీమాస్ తెలంగాణలో జిహెచ్ఎంసి పరిధి లోని అన్ని సంఘాలకు, సమాఖ్యలకు కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధక చర్యలు ఎలా తీసుకోవాలో, గర్భిణులు, బాలింతలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ దిగువ పేర్కొన్న అంశాలను సంఘాలకు, సమాఖ్యలకు వాట్సప్ సందేశాల ద్వారా తెలియజేసింది. జీహెచ్ఎంసి పరిధిలో ఏపిమాస్ నిర్వహిస్తున్న 'పోషకాహార ప్రాజెక్ట్' సభ్యులు ఆండాలు గారు, సువర్ణ గారు సంఘాల, సమాఖ్యల వారికి నేరుగా వివరించారు.




**అవగాహన కలిగించిన అంశాలు**

1) కోవిడ్-19 సమయంలో పెద్దలకు పోషకాహార సలహాలు
2) కోవిడ్-19 సమయంలో నవజాత శిశువు సంరక్షణలో తల్లులకు సూచనలు.
3) కోవిడ్-19 గురించి సందేహాలు

- మనకు తెలియనివారికి దూరంగా ఉండడం చాలా ముఖ్యం. వ్యాధి తీవ్రత ఎక్కువ ఉంది కాబట్టి తెలియని వారిని ముట్టుకోవడం, తాకడం లాంటివి చేయకూడదు.
- అపరిచితులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఎందుకంటే వ్యాధి కారకాలు... ఒకరి నుంచి మరొకరికి చేరే అవకాశం ఉంది. కాబట్టి తెలియనివారికి అంత సన్నిహితంగా మెలగడం మంచిది కాదు.
- చాలామందికి వ్యాధి సోకే అవకాశం ఉంది కాబట్టి, నలుగురిలోకి వెళ్లేటప్పుడు మాస్క్ ధరించడం చాలా మంచిది. తెలియని వారిని తాకకూడదు
- ఎప్పటికప్పుడు చేతుల్ని శుభ్రంగా కడుగుతూ ఉండాలి.
- కళ్లు, నోరు, ముక్కు భాగాలను తాకొద్దు.

**సంఘాలు, సమాఖ్యల సేవలు**

లాక్ డౌన్ వల్ల రోజువారీ కూలీలు బయటకు వెళ్లే పరిస్థితి లేనందువల్ల సంఘాల, సమాఖ్యల వారు జిహెచ్ఎంసి (యుసిడి) ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలలో రైతు బజారులు ఏర్పాటు చేయించి, సామాజిక దూరం పాటింపజేస్తూ తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులను , కూరగాయలను వారికి అందేలా చేశారు. భవాని సమాఖ్య, భూలక్ష్మి నగర్ సమాఖ్య, శాలివాహన సమాఖ్య, లక్ష్మీబాయి సమాఖ్య, షిరిడిసాయి సమాఖ్య మొదలైన సమాఖ్యలు, సంఘాల వారు ఈ కార్యక్రమంలో సహకరించారు. రైతు బజార్లతోపాటు రేషన్ దుకాణం దగ్గర సరుకులు తీసుకునేటప్పుడు సామాజిక దూరం పాటించేలా వారికి భూలక్ష్మినగర్ సమాఖ్య, షిరిడి సాయి సమాఖ్య, లక్ష్మిబాయి సమాఖ్య, అమ్మ భవాని సమాఖ్యల సభ్యులు వారికి అవగాహన కలిగించారు.

వలస కార్మికులను ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చడం కోసం వారికి రేషన్ కార్డులను ఇప్పించడం, బస్తీలో మురుగు కాలువలు పొంగి పొర్లితే లాక్ డౌన్ సమయంలో



జీహెచ్ఎంసికి ఫోనులు చేసి ఆ సమస్యను పరిష్కరించారు. మాములుగా అయితే ఇలాంటివి పెద్ద విషయాలు కాకపోవచ్చు. కానీ కోవిడ్-19 సమయంలో వలస కార్మికులకు రేషన్ కార్డు లేకపోతే సరుకులు దొరకటం కష్టం మరియు బస్తీలలో మురికి కాలవలు వలన పరిశుభ్రత లోపిస్తే అంటువ్యాధులు ఇంకా ఎక్కువగా వ్యాపిస్తాయనే ఉద్దేశంతో భగత్సింగ్ సమాఖ్య, షిరిడి సాయి సమాఖ్య, శాలివాహన సమాఖ్య లీడర్లు ముందడుగు వేసి సమస్యలు పరిష్కరించారు.

గాంధీనగర్‌లోని అమ్మ భవాని సమాఖ్య వారు అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం సరఫరాలో అంగన్వాడి టీచర్లకు సహకరించి గర్భిణులకు, బాలింతలకు బాలామృతం, బియ్యం, గుడ్లు, పాలు సక్రమంగా అందేటట్లు చూశారు.

ఎన్‌టిఆర్ నగర్‌కు చెందినవెన్నెల వెలుగు సమాఖ్య వారు కష్టకాలంలో పేద మహిళలకు, చిన్నపిల్లలకు మధ్యాహ్నం భోజనం వండి అందించటం ద్వారా తమ మంచి మనసును చాటుకున్నారు

**ప్రముఖుల సహాయానికి సమాఖ్యల తోడ్పాటు**

గాంధీనగర్, భూలక్ష్మినగర్‌లో సైదాబాద్ ఎంఎల్ఏ గారు 10 కిలోల బియ్యం, కిలో నూనె ప్యాకెట్, కిలో ఉప్పు ప్యాకెట్, అరకిలో కారప్పొడి, అరకిలో పప్పు, అరకిలో పంచదార చొప్పున అన్ని కుటుంబాలకు పంచిపెట్టారు. ఈ పంపిణీలో సమాఖ్య అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అరుణ గారు , మంజుల గారు తమ వంతు సహకారాన్ని అందించారు.

ముశారంబాగ్ పరిధిలో కార్పోరేటర్ శ్రీమతి సునరితారెడ్డి గారు నిత్యావసర సరుకులు (10 కిలోల బియ్యం, కిలో నూనె ప్యాకెట్, కిలో ఉప్పు ప్యాకెట్, అరకిలో కారప్పొడి, అరకిలో పప్పు, అరకిలో పంచదార) 500 రూపాయల నగదు ప్రతి ఒక్క కుటుంబానికి ఇచ్చారు. ఈ పంపిణీలో సమాఖ్య ఆర్ పి లు అయిన సువర్ణ గారు, అండాలు గారు, శాలివాహన సమాఖ్య అధ్యక్షురాలు బాలచిన్నమ్మ గారు సహాయపడ్డారు.

ఏపీమాస్ సంస్థ సిఇఓ శ్రీ సిఎస్ రెడ్డి గారు తీగలగూడ మురికివాడ పరిధిలోని 150 వలస కార్మిక కుటుంబాలకు, వృద్ధాశ్రమానికి వారం రోజులకు సరిపడా కూరగాయలు, పండ్లు పంపిణీ చేశారు.

ఈ పంపిణీలో ఏపీమాస్ సంస్థ నుంచి శ్రీ నవీన్ కుమార్, శ్రీ కిషోర్‌కుమార్ శ్రీ ఖాదిర్ భాయ్ , ఏపీమాస్ సంస్థలో ఆరోగ్య కార్యకర్తలుగా పని చేసిన సమాఖ్య ఆర్ పి లు శ్రీమతి అండాలు, శ్రీమతి సువర్ణ సహాయపడ్డారు.

జీహెచ్ఎంసి పరిధిలో దాదాపు 150-200 మంది శరణార్థులకు (బిచ్చగాళ్ళు, తాపీ పనివాళ్ళు, వలస కూలీలు) ప్రతిరోజూ భోజనం ఆటోలో తీసుకువెళ్ళి ఇచ్చి వస్తున్నారు, యుసిడి – పీఓ శ్రీ శ్రీనివాసరావు గారు, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీ విజయేంద్ర గారు ఈ బాధ్యత వహించారు.

కోవిడ్-19 లాక్ డౌన్ కారణంగా యావత్ ప్రపంచం 'ఇంట్లోనే వుండండి .... క్షేమంగా వుండండి'అని ఎవరి ఇంట్లో వాళ్ళు ఉండగా అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎ యెన్ ఎంలు మాత్రం తమ క్షేమం కోసం ఆలోచించకుండా తమ వంతు భాధ్యతగా ప్రజలకు అందవలసిన సేవలకు ఎటువంటి అంతరాయం కలుగ కుండా నిత్యం యధావిధిగా తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. వీరందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ■



# ఒంగోలులో సంఘాలచే సహాయ కార్యక్రమాలు!

– డి. నాగలక్ష్మి

**సం**ఘాలు, సమాఖ్యలు అంటే రుణాలు తీసుకోవడమే కాదు తాము కూడా సమాజానికి ఇవ్వగలం అని మరోసారి నిరూపించిన సంఘటనలు ప్రస్తుతం కరోనా వైరస్ నియంత్రణ సమయంలో చూస్తున్నాం. పనికెళ్లిన రోజే తిండి దొరుకుతుంది. లేదంటే పస్తులుండే కుటుంబాలు ప్రకాశం జిల్లాతో పాటు, మన ప్రాంతాలలో చాలానే ఉన్నాయి.

ఈ కరోనా కష్ట సమయంలో అలాంటి వారికి ప్రభుత్వం తరపున సహాయం అందుతున్నప్పటికీ సమాఖ్యలు, సంఘాల సభ్యులు వాళ్ళ స్థాయిలో పేదలకు, వృద్ధులకు, బిక్షాటన చేసేవారికి సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.



**'మార్పు' కార్యక్రమ ప్రాంతాలలో ....**

ఏపిమాస్ నిర్వహణలో ఒంగోలు పట్టణంలో 'మార్పు కార్యక్రమం అమలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈ క్రింది సహాయ చర్యలను చేపట్టడం జరిగింది.

1. సంపురం ఈస్ట్ సమాఖ్య సభ్యులు స్వయంగా భోజనం వండి వృద్ధాశ్రమంలోని వాళ్ళకు అన్నదానం చేశారు
2. వంట వారి కాలనీ సమాఖ్య వారు నిరాశ్రయుల భవనంలో ఉండే వారికి 5 రోజులపాటు భోజనం వండి పంపించారు. పార్క్‌లో తలదాచుకుంటూ బిచ్చమెత్తుకుని బతికే 500 మందికి ఒకరోజు అన్నం పొట్లాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.



3. ఈ ప్రాంతంలోని 21 సమాఖ్యల సభ్యురాళ్ళు ఒక్కొక్క సభ్యురాలికి 10 రూపాయల చొప్పున 2500 రూపాయలు సేకరించి, విరాళాన్ని ప్రభుత్వానికి పంపించారు.
4. ముక్తినూతలపాడు దేవిక మహిళా సమాఖ్య వారు ఆర్థిక సహాయంతో పాటు 150 మందికి మాస్కులను తమ ఇండ్ల వద్దనే కుట్టి పంపిణీచేశారు.
5. బియ్యం పంపిణీ మొదలైన సందర్భాలలో అనేక ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు సామాజిక దూరం పాటించడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం గురించి అవగాహన కలిగించారు..
6. వీధులలో బ్లీచింగ్ చేసే సమయంలో ఆశ వర్కర్స్‌తో కలసి కార్యక్రమాన్ని సరిగ్గా జరిగేలా సహకరించారు.
7. అంగన్వాడీ కేంద్రాలలో బియ్యం మొదలగు సరుకులు గర్భవతులకు, బాలింతలకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడంలో మార్పు కార్యకర్తలు, సమాఖ్య వారు సహకారం అందించారు. ■

# కరోనాపై అవగాహన, మాస్కుల పంపిణీ !

– ఆర్ వై వి ఎస్ వి భాస్కర రావు






**క**రోనా వైరస్‌కు చికిత్స కంటే నివారణే ముఖ్యం అనే ఉద్దేశంతో నెల్లూరు జిల్లాలో ఏపిమాస్ కార్యక్షేత్రాలైన శ్రీరామపురం, పెయ్యలపాలెం గ్రామాలలో ప్రజలకు చైతన్య సమావేశాలను నిర్వహించి, అవగాహన కలిగించడం జరిగింది.

జలుబు, దగ్గు, తుమ్ములు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఇంట్లోనే ఉండండి. ఇంట్లో నయినా మిగిలిన కుటుంబ సభ్యులకు దూరంగా ఉండండి. చేతితో కళ్ళు, ముక్కు, నోరు తుడుచుకోరాదు. సబ్బుతో చేతులు కడుక్కోవాలి ,దగ్గు,తుమ్ము వస్తే మోచేయి అడ్డంపెట్టుకోవాలి, చేతిగుడ్డతో ముక్కు ,నోరూ మూసుకోవాలి,ఇతరులకు దూరంగా ఉండాలి అనే విషయాలను తెలియపరుస్తూ 'ప్రవేశ ఇండస్ట్రీస్', ఏపిమాస్ సహకారంతో మాస్కులను పంపిణీ చేయడం జరిగింది.

శ్రీరామపురం మహిళా సంఘ సభ్యులతో, స్థానిక ఉపాధ్యాయులతో అవగాహన సదస్సు,పెయ్యలపాలెం మహిళా సంఘ సభ్యులతో, అరబిందో ప్రతినిధి శ్రీ పెనాక గోపీనాథ్ రెడ్డి, విడిసి సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించి, అరబిందో, ఏపిమాస్ సహకారంతో మాస్కులను పంపిణీ చేయడం జరిగింది.

పెయ్యలపాలెం గ్రామం లో అరబిందో ప్రతినిధి శ్రీ పెనాక గోపీనాథ్ రెడ్డి , విడిసి సభ్యులతో 300 కుటుంబాలకు 6 రకాల కూరగాయలను అరబిందో, ఏపిమాస్ సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. చుట్టు ప్రక్కల 9 గ్రామాల బ్రాహ్మణ కుటుంబాలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

**మాస్కుల తయారీ :** ప్రస్తుతం బజార్లో లభించే మాస్కులు అంత బాగా లేవు. వాటిని తిరిగి వాడలేము. ప్రతి రోజూ కొత్తవి వాడాల్సిందే, ఇదే అదునుగా 5 రూపాయలు ఖరీదు చేసే మాస్కును 30 రూపాయలకు అమ్ముతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి డి ఆర్ డి ఏ తో కలసి పెయ్యలపాలెం మహిళా సంఘ సభ్యులతో మాస్కులు కుట్టించి సరఫరా చేస్తున్నారు. ఇందువల్ల ప్రజలకు నాణ్యమైన మాస్కులు లభించడంతోపాటు, మహిళా సంఘ సభ్యులకు కొంత ఆదాయం లభిస్తూ ఉభయులకూ ఉపయోగకరంగా వుంటుంది. ■



డబ్బు లేకపోవడం దరిద్రం కాదు, తోడు లేకపోవడం, అభిమానించేవారెవరూ లేరనే బాధే అసలు దరిద్రం

# భూమాత ఎఫ్‌పిఓ సేవా కార్యక్రమాలు !

– బి. భవాని

ధర్మవరం మండలం ఆజీవ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటైన 'భూమాత' ఎఫ్‌పిఓ పరిధిలోని రావులచెరువు, ధర్మపురి, ఎన్ ఆర్ కె కొట్టాల, సి .బత్తలపల్లి, తుంపర్తి, పోతులనాగేపల్లి అనే ఆరు గ్రామాలలోని ఎస్ ఎం జి లలో 561 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం కరోన కారణంగా ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌తో వీరందరూ ఇళ్లకే పరిమితమైనారు.



ఈ సందర్భంలో ఏపిమాస్ ఆజీవ ప్రాజెక్టు వారు సభ్యుల అవగాహన, నిత్యావసరాల కోసం ఆర్థిక చేయూత కల్పించడం జరిగింది. అందులో భాగంగా ప్రతి సభ్యురాలికి భూమాత ఎఫ్ పి ఓ నుండి ఒక వారానికి సరిపడా 8 రకాల కూరగాయలు, చేతులు శుభ్రపరుచుకోవడం కోసం 1 సబ్బు, 2 మాస్కులు, కరోనా వైరస్ రాకుండా తీసుకోవలసిన జాగ్రతలకు సంబంధించిన అవగాహన పత్రం అందజేశారు. టమాట 2 కేజీ, మిరప 1 కేజీ, వంగ 1 కేజీ, క్యారెట్టు 1 కేజీ, యర్రగడ్డలు 1 కేజీ, ఆలుగడ్డలు 1 కేజీ, గోరుచిక్కుడు 1 కేజీ, క్యాబేజీ 1 కేజీ ప్రకారం కాయగూరలు పంపిణీ చేశారు. టమాట, గోరుచిక్కుడు రకాలు మార్కెట్‌ధర కన్నా తక్కువ ధరకు రైతు దగ్గర కొనుగోలు చేయడం జరిగింది.

యాక్షన్ ఫ్రెటర్నా (ఎ ఎఫ్) కు చెందిన శ్రీ నరేంద్ర తన సొంత పొలంలో జడ్ బి ఎన్ ఎఫ్ పద్ధతులతో పండించినచవంకాయలను ఆజీవ సభ్యుల కోసం ఉచితంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొదట 5 రకాల కూరగాయలను పంపిణీ చేయాలి అని బి ఓ డి సభ్యులు తీర్మానించారు. కానీ 2 రకాల కూరగాయలు తక్కువ ధరకు రైతుల దగ్గర కొనడం, వంకాయలు ఉచితంగా అందడం వల్ల 8 రకాల కూరగాయలను పంపిణీ చేసే అవకాశం కలిగింది.

ఇంతే కాకుండా ప్రతి గ్రూప్ సభ్యురాలు స్వచ్ఛందంగా 20 రూపాయలు చొప్పున 561 మంది కలిసి మొత్తం 11,220 రూపాయలు సేవ రుసుముగా ఎఫ్ పి ఓ కు చెల్లించారు. సభ్యుల నుండి వసూలయిన సేవ రుసుమును భవిష్యత్ అవసరాల కోసం ఉపయోగించుకోవాలని సభ్యుల ఆమోదంతో పాలకవర్గసభ్యులు ఆ మొత్తాన్ని ఎఫ్ పి ఓ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. కూరగాయలను ప్యాకెట్లు కట్టడం, పంపిణీ చేయడం మొత్తం కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులతో పాటు రావులచెరువులోని 2 గ్రూప్ సభ్యులు మొత్తము 32 మంది పాల్గొన్నారు.

ఎ ఎఫ్ ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వై వి. మల్లారెడ్డి గారి సూచనలతో సెంట్రల్ సిబ్బంది సి బి ఐ డి కోఆర్డినేటర్ బి.రాజశేఖర్ గారు, పి ఎం ఎఫ్ నుండి సుజాత గారు, సంబంధిత మండల సిబ్బంది పి ఎం ఇ ఈశ్వర్ రావు గారు, ఎం టి ఎల్ లక్ష్మన్న గారి సహకారంతో ఆజీవ కోఆర్డినేటర్ పి.విక్రమ్ మణిపాల్ రెడ్డి గారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యులకొరకు ఇంతటి గొప్ప కార్యకమాన్ని చేయడానికి అవకాశం కల్పించినందుకు అజీవ, ఏపిమాస్, ఎ ఎఫ్ ఎకాలజీ సెంటర్ వారికి భూమాత ఎఫ్ పి ఓ వారు ధన్యవాదాలు తెలియజేశారు. ■



మంచి అలవాట్లను మానుకోవడం చాలా సులభం, చెడు వదిలించుకోవడం మహా కష్టం

# ఆజీవ ఎఫ్ పి ఓ, 'పీస్' సేవా కార్యక్రమాలు !

– బి. భవాని

కరోనా మహమ్మారి కారణంగా లాక్ డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న గ్రామీణులకు కావలసిన కూరగాయలను గ్రామాలకు వ్యాన్‌లో తీసుకు వెళ్ళి నేరుగా విక్రయించడానికి ఆజీవ ఎఫ్ పి ఓ కు జిల్లా అధికారులనుంచి ప్రోత్సాహం లభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, 2020 ఏప్రిల్ 1 నుండి మొబైల్ మార్కెటింగ్‌ను ఆజీవ ఎఫ్ పి ఓ ప్రారంభించింది. ప్రతిరోజు ఎఫ్ పి ఓ సిబ్బంది భోంగిర్ రైతు బజారుకు వెళ్లి నేరుగా కూరగాయలను సేకరిస్తారు.



బొమ్మల రామారం మండలం, వోలిగోండ, ఆత్మకూర్ మండల గ్రామాలకు చెందిన రైతులు భోంగిర్ రైతు బజార్ వద్ద కూరగాయలను అమ్ముతారు. ఎఫ్ పి ఓ మార్కెటింగ్ సిబ్బంది ఎఫ్ పి ఓ సభ్య రైతుల (ఎఫ్‌పిఓ షేర్ హోల్డర్స్) నుండి కొనుగోలు చేయాలని సలహా ఇచ్చారు. రేట్లను రైతు బజార్ నిర్ణయిస్తుంది. ప్రతి రోజు ఈ ఎఫ్ పి ఓ రైతుల నుండి నాలుగైదు వేల రూపాయల విలువైన కూరగాయలను కొనుగోలు చేసి, ఎఫ్ పి ఓ కు వున్న వ్యాన్‌లో గ్రామాలకు తీసుకువెళ్ళి విక్రయిస్తున్నది. జిల్లా కలెక్టర్ ఆజీవ ఎఫ్ పి ఓ కృషిని ప్రశంసించారు.

యాదాద్రిగుట్ట మండల గ్రామస్తులు భోంగిర్ మార్కెట్‌పై మాత్రమే ఆధారపడ్డారు. కూరగాయలను ప్రైవేట్ విక్రేతలు, రిటైల్ విక్రేతలు తీసుకువస్తారు. లాక్ డౌన్ కారణంగా ప్రజలు కూరగాయలు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర వస్తువులను పొందలేకపోతున్నారు. వలస కార్మికులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, నిరుపేదలకు కూరగాయలను పంపిణీ చేసే బాధ్యతను పీస్, ఆజీవ ఎఫ్‌పిఓ సిబ్బంది చేపట్టారు. వీరు ఈ కార్యకలాపాలను 2020 ఏప్రిల్ 13 నుండి ప్రారంభించారు. చోలర్ గ్రామంలో కూరగాయలు పంపిణీ చేయబడ్డాయి. 3.5 కిలోల నుండి 4 కిలోల టొమాటో, వంకాయలు, బెండకాయలు, మునగ కాయలు, బంగాళాదుంపలు, పొట్లకాయ, పాలకూర వంటి కూరల బుట్టలను ఏప్రిల్ 16న చోలర్ గ్రామంలో 450 ప్యాకెట్లను, మారిగుడెమ్ గ్రామంలో 250 ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఏప్రిల్ 17న మహబూబెట్ పేట గ్రామంలో 250 పాకెట్స్ పంపిణీ చేశారు. ప్యాకింగ్ సమయంలో ఎఫ్ పి ఓ బోర్డు సభ్యులు గ్రామంలోని యువకులను సహాయకులుగా చేర్చుకున్నారు. వారు గ్రామంలో అన్ని ఇండ్లకు వెళ్ళి పంపిణీ చేశారు.

ఏప్రిల్ 22 వీరారెడ్డి పల్లి గ్రామంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన 30కి పైగా వలస కార్మికుల కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఏప్రిల్ 24న రాజపేట మండలంలో ఇటుక బట్టీ లో పనిచేసే 40 వలస కార్మికుల కుటుంబాలకు 1.6 క్వింటాళ్ల బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. చోలర్ గ్రామంలో 200 మాస్కులను పంపిణీ చేశారు.

**వరి సేకరణ కేంద్రం ప్రారంభం**

సాదువల్లి గ్రామంలో 2020 ఏప్రిల్ 16 న వరి సేకరణ కేంద్రం ప్రారంభమైంది. మండల అధ్యక్షుడు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. టి. అనురాధ జెడ్‌పిటిసి, రామిరెడ్డి పిఎసిఎస్ చైర్‌పర్సన్, యెడ్లా సుగుణ, ఎంపిటిసి, మీసా సత్యలక్ష్మి, సర్పంచ్ సాదువల్లి గ్రామం, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ■



# కరోనాలో భారత ప్రతిష్ఠ పెంచిన విశిష్ట వ్యక్తులు !

**అ**గ్రదేశాల వెన్ను విరిచిన కరోనా భారతదేశంలో తలవంచడానికి ముగ్గురు మహిళా అధికారులు కీలకమైన పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. గత రెండు నెలల నుండి ఆఫీసు లోనే నివాసముంటూ, కుటుంబాలను కూడా కలవలేకపోయిన ఈ ముగ్గురు భారత జాతికే కాకుండా ప్రపంచానికే ఆదర్శమయ్యారు. వీరే ప్రీతి సుడాన్, డాక్టర్ నివేదిత గుప్త, సైంటిస్ట్, రేణు స్వరూప్.



**ప్రీతి సుడాన్:** హెల్త్ సెక్రటరీగా పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెంది1న ఈ ఐఎఎస్ ఆఫీసర్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి పీజీ చేసి వరల్డ్ బాంక్‌లో కూడా పని చేశారు. ఇప్పుడు కరోనా యుద్ధంలో నరేంద్ర మోడీ గారితో ప్రత్యక్షంగా పని చేస్తూ మన్ననలు పొందుతున్నారు. చైనా లోని వూహాన్ నుండి 645 మంది భారతీయులను స్వదేశానికి తీసుకురావడంలో కీలక భూమిక పోషించారు.

**డాక్టర్ నివేదిత గుప్త :** స్వయంగా ఎంబిబిఎస్ అయిన ఈమె మాలిక్యులర్ మెడిసిన్‌లో పీహెచ్‌డీ చేసి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో డెంగ్యూ, చికెన్ గున్యా, సార్స్, నిఫా వైరన్‌లను ఎదుర్కోవడంలో ఈమె కృషిని ప్రపంచదేశాలు ప్రశంసించాయి. ఇప్పుడు కరోనా యుద్ధంలో పరీక్షా పద్ధతులు, గైడ్ లైన్స్ రూపొందించడమే కాకుండా దేశ వ్యాప్తంగా 182 లేబరేటరీలను కొద్ది రోజుల వ్యవధిలో నిర్మించారు. వీటికి అవసరమైన పరికరాలు, ముడి పదార్థాలు, టెక్నీషియన్ల శిక్షణ మొదలైన వాటిని స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రపంచదేశాలను సమన్వయం చేస్తున్నారు.



**డాక్టర్ రేణు స్వరూప్ :** జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్‌లో పీహెచ్‌డీ చేసిన ఈ ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త నరేంద్ర మోడీగారి శాస్త్ర సలహాదారుల కమిటీలో సేవలందిస్తున్నారు. కరోనాపై యుద్ధంలో దేశవ్యాప్త పరిశోధనా సంస్థలు, పరిశ్రమలను సమన్వయం చేస్తూ మందులను, వాక్సిన్‌ను తయారుచేయడంలో తలమునకలై ఉన్నారు. ఈమె 2001, 2007, 2015లో రూపొందించిన బయో టెక్నాలజీ విజన్ డాక్యుమెంట్లు ఎన్నో ప్రశంసలు పొందాయి.



వీరే కాకుండా ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు అధికారులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. వారిలో మొదటి వారు లవ్ అగర్వాల్.

**లవ్ అగర్వాల్ :** ఐఐటి ఢిల్లీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివి ఐఏఎస్ సాధించిన ఈ 48 ఏళ్ల యోగా నిపుణుడు విశాఖ జిల్లా కలెక్టర్‌గా, ఆంధ్రప్రదేశ్ హెల్త్ కమీషనర్‌గా పని చేశారు. ఇప్పుడు ఢిల్లీలో జాయింట్ సెక్రటరీగా పని చేస్తూ ప్రతి రోజు ప్రెన్ బ్రీఫింగ్ చేస్తున్నారు. అనేక వినూత్న ప్రయోగాలతో ప్రపంచ దేశాలకు ఆదర్శం అవుతున్నారు. మొబైల్ ఫోన్ల కరోనా కాలర్ ట్యూన్, కంటైన్మెంట్ స్ట్రాటజీ, సోషల్



నిన్ను బాధించిన విషయం మరచిపో, అయితే, ఆ సంఘటన నేర్పిన పాఠం ఎన్నడూ మరువకు



డిస్టెన్సింగ్ నార్మ్స్, క్లస్టర్ ఔట్ బ్రేక్ స్ట్రాటజీలు ఈయన రూపొందించినవే.

**డాక్టర్ జితేందర్ శర్మ :**

సత్యసాయి బాబాకు అత్యంత విశ్వాస పాత్రుడు, పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్‌గా పని చేసిన ఈయనను ఏపీ మెడ్ టెక్ ఎం.డీ గా, కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ టెక్నాలజీ అధిపతిగా నియ మించారు. ఈయన పని ప్రారంభించిన కొద్ది రోజులలోనే దేశంలోనే మొట్టమొదటిగా రాపిడ్ టస్ట్ కిట్స్‌ను తయారు చేయిస్తున్నారు. ఇవి కేవలం యాభై నిముషాలలో కరోనాను నిర్ధారిస్తాయి. ప్రస్తుతం రోజుకు రెండు వేల కిట్లు తయారవుతుండగా త్వరలో ఇది ఇరవై ఐదు వేలకు చేరుతుందని అంచనా.

మార్చి 31నాటికి ఆంధ్రప్రదేశ్ మొత్తంలో కేవలం 148 వెంటిలేటర్లు ఉండగా, జితేంద్ర శర్మ గారి నేతృత్వంలో నెలకు మూడు వేల వెంటిలేటర్లు తయారుచేయడానికి కృషి జరుగుతోంది. దీనితో ఆసియా మొత్తానికి ఈయన కృషి ఫలితాలు అందనున్నాయి. ■

# అన్ని జిల్లాల్లో 100 రూపాయలకే పండ్ల కిట్ !

ఫ్రూట్ కిట్ల విక్రయాన్ని అన్ని జిల్లాలకూ విస్తరించాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య కలెక్టర్లకు లేఖలు రాశారు. కర్నూలు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన రూ. 100 కే పండ్ల కిట్ అమ్మకం విజయవంతమైనందున రాష్ట్రమంతటా ఈ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

**లేఖలో అంశాలివీ...**

- స్థానికంగా దొరికే ఏవైనా ఐదు రకాల పండ్లను కిట్ రూపంలో తయారుచేసి 100 రూపాయల చొప్పున విక్రయించాలి.
- ఇందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో), ఉద్యానశాఖ సహకారాన్ని తీసుకోవచ్చు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం ప్రతి వ్యక్తి రోజుకు 350 గ్రాముల కూరగాయలు, వంద గ్రాముల పండ్లు తీసుకోవాలి.
- ఆ సూత్రం ఆధారంగా కరోనా వైరస్ వ్యాధి నివారణకు ఉపయోగపడే విటమిన్ ఏ, సీ ఉండే పండ్లను పంపిణీ చేయాలి.

**అనూహ్య స్పందన**

- లాక్‌డౌన్ సమయంలో .... రైతు సేవలో ఎఫ్‌పీవోలు శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్త చూసి, తమకు వందలాదిమంది ఫోన్లు చేసి పండ్ల కిట్ల పంపిణీలో పాలు పంచుకుంటామని చెప్పినట్లు ఉద్యాన శాఖ జాయింట్ డైరక్టర్ పి. హనుమంతరావు తెలిపారు.
- అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, కాలనీ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఫండ్ల వ్యాపారులు, ఏజెంట్లు, పండ్ల రైతులు, వెండర్లు... ఇలా అన్ని వర్గాల నుంచి స్పందన రావడంతో వాళ్ళను సమీపంలోని ఎఫ్‌పీవోలకు అనుసంధానం చేశామన్నారు.

**ఇతర జిల్లాలకూ విస్తరిస్తున్నాం**

- ప్రజల వద్దకే పండ్ల పంపిణీ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చినందున ఇతర జిల్లాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదురి తెలిపారు.

('సాక్షి' సౌజన్యంతో) ■

నిర్లక్ష్యం చూపడం, పట్టించుకోక పోవడం కంటె నచ్చలేదని చెప్పడం మేలు

# ఎస్ హెచ్ జి లకు మూడునెలల అదనపు వడ్డీ!

**క**రోనా కారణంగా నెలకొన్న లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలకు ఊరట కలిగించేందుకు ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలు ఆచరణలో ప్రజలకు భారంగా మారాయి. పనులు కోల్పోయి ఆదాయం పడిపోయిన ప్రజలకు మూడు నెలల పాటు బకాయిల కిస్తీలు (ఈఎంఐ) చెల్లించవలసిన పనిలేకుండా వెసులుబాటు కల్పించింది. అయితే ఈ వెసులుబాటు కాలానికి సంబంధించిన వడ్డీ విషయంలో స్పష్టత లోపించింది. దీంతో బ్యాంకులన్నీ ఈ మూడు నెలల కాలానికి కూడా వడ్డీ చెల్లించాలని చెబుతున్నాయి. ఇప్పుడు ఇదే సమస్య స్వయంసహాయ (ఎస్ హెచ్ జి) మహిళలను వెంటాడుతోంది.

ఉదాహరణకు పశ్చిమ గోదావరి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 74,258 స్వయం సహాయక బృందాలున్నాయి. వీటిలో 7.8 లక్షల మంది మహిళలు సంఘటితమై ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా వీరు తీసుకున్న రుణాల బకాయిల మొత్తం 2,740 కోట్ల రూపాయలు. దీనిపై 11 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. మారటోరియం కింద అదనంగా ఇచ్చిన ఈ మూడునెలలకు కూడా వీరు 11 శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సిందేనని బ్యాంకులు చెబుతున్నాయి.

**స్పష్టత రాలేదు : శరత్, ఏపీఎం, డీఆర్‌డీఏ**

డ్వాక్రా రుణాల చెల్లింపులకు మూడునెలల ఊరట ఇచ్చారు. వడ్డీ విషయం చెప్పలేదు. దీంతో బ్యాంకులు వడ్డీ వసూలు చేసేందుకు సిద్ధమయ్యాయి. ఆ భారం డ్వాక్రా గ్రూపులే భరించాలి. కేంద్రం వడ్డీని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంటేనో, రాష్ట్ర ప్రభుత్వం అదనపు వడ్డీని చెల్లిస్తేనో తప్ప ఆ భారం తగ్గదు.

ఆర్బీఐ మూడు నెలలపాటు కిస్తీల చెల్లింపుకు ఊరట ఇవ్వాలని బ్యాంకులకు సూచించింది. వడ్డీ విషయమై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. దీంతో బ్యాంకులు అదనంగా పెరిగిన మూడు నెలలకు కూడా వడ్డీ వసూలు చేసేందుకు సిద్ధమయ్యాయి. అదే గనుక జరిగితే, పశ్చిమ గోదావరి జిల్లాలోనే ప్రతీ నెలా రూ. 25.14 కోట్ల చొప్పున మూడునెలలకు కలిపి 76 కోట్ల రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. అయితే ఇది సాధారణవడ్డీ లెక్క. మామూలుగా బ్యాంకులు చక్ర వడ్డీని అమలు చేస్తాయి. ఆ విధంగా చూసుకుంటే మరో కోటి రూపాయలు అదనంగా భారం తప్పకపోవచ్చు.

**ఎస్‌హెచ్‌జీలకు, రైతులకు బీఓబీ ఆర్థిక సాయం**

కోవిడ్–19 నేపథ్యంలో ఫండింగ్ అవసరాలు తీర్చేందుకు ప్రతి మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)కు కనిష్ఠంగా 30 వేల రూపాయలు, గరిష్ఠంగా రూ.లక్ష వంతున ఆర్థిక సహాయం అందించనున్నట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్ డ్రాఫ్ట్ లేదా టర్మ్ రుణం కింద ఈ సహాయం అందించనున్నట్టు తెలిపింది. ఎస్‌హెచ్‌జీలు ఈ మొత్తాలను 24 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. అలాగే వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు, పాడి పరిశ్రమ, ఫిషరీస్ విభాగాలకు చెందిన ఉత్పత్తులు తయారుచేసే వారికి కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్టు పేర్కొంది.

వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు 36 నెలల కాలపరిమితిలో తిరిగి చెల్లించే విధానంలో గరిష్ఠంగా రూ.5 లక్షలు, పాడి పరిశ్రమ, ఫిషరీస్ రైతులకు గరిష్ఠంగా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్టు తెలియచేసింది. మహిళా ఎస్‌హెచ్‌జీలు ఆ రుణాన్ని నెలవారీ లేదా త్రైమాసిక వాయిదాల్లో చెల్లించవచ్చు. వ్యవసాయదారులు, ఎస్‌హెచ్‌జీలకు అందించే రుణంపై ఆ మొత్తం అందించిన నాటి నుంచి 6 నెలల మారటోరియం వర్తింపచేస్తారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డులున్న వారందరికీ వ్యవసాయ ఖర్చుల కోసం కనిష్ఠంగా రూ.10 వేలు, గరిష్ఠంగా రూ.50 వేలు సహాయం అందించనున్నట్టు ప్రకటించింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

# జామ సాగులో కొత్తదనం ... ఆదాయం అధికం !

– ఎస్.ప్రహల్లాద, పి.నవీన్

**మా**రుతున్న కాలానికి అనుగుణంగా యువత వ్యవసాయరంగంలో ప్రవేశించి, కొత్త యాజమాన్య పద్ధతులను అవలంబించి, నాణ్యమైన దిగుబడులను పొందగలగడమే కాకుండా, తమ ఉత్పత్తులకు మార్కెట్ హామీని, అధిక ఆదాయాన్ని పొందగలుగుతున్నారు. ఇందుకు ఉదాహరణే చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతి యరపశెట్టి పల్లి గ్రామ నివాసి శ్రీ నారాయణ రెడ్డి, ఆయన కుమారుడు శ్రీ చంద్రశేఖర్ !



నారాయణరెడ్డి గారికి మొత్తం 10 ఎకరాల పొలం వుంది. ఇందులో సాధారణంగా అందరూ సాగు చేస్తున్నట్టు టమాట పంట వేసి పంట చేతికి వస్తుందో లేదో అనే అనిశ్చిత పరిస్థితిలో కొట్టుమిట్టాడకుండా మార్కెట్ హామీ లభించే పండ్ల తోటలను పూర్తిగా వ్యాపార దృష్టితో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో గిరాకి వున్న వివిధ రకాల పండ్లను, కూరగాయలను పండిస్తున్నారు. సమయాన్ని బట్టి కరబూజ, దోస, జామ మొదలగు పండ్ల తోటలతో పాటు అదునులో టమాట పండిస్తున్నారు.

నారాయణరెడ్డి గారి కుమారుడు శ్రీ చంద్రశేఖర్ కంప్యూటర్ సైన్సులో పట్టభద్రులు. బెంగళూరులో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అది ఇతర దేశాలలో నూతన వ్యవసాయ పద్ధతులపై సాంకేతిక సలహాలు యిచ్చే కంపెనీ. ఇతర దేశాలకు సలహాలు ఇస్తున్న కంపెనీలో పని చేస్తున్న శ్రీ చంద్రశేఖర్ ఆ సలహాలను తమ పొలంలో పాటించాలని సంకల్పించి, బెంగలూరులోని తమ మిత్రుల తోడ్పాటుతో తమ పొలంలో నూతన పద్ధతులతో అదిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ జామ తోట సాగు చేస్తున్నారు. ఈ జామ నారును రాజమండ్రి నుండి తీసుకొని వచ్చారు. ప్రస్తుతం 2 ఎకరాలలో జామ తోటను పెంచుతున్నారు. ఈ వ్యాసకర్త తన క్షేత్ర పర్యటనలో భాగంగా నారాయణరెడ్డి గారి పొలాన్ని సందర్శించినపుడు, క్రింది అంశాలను గమనించడం జరిగింది.

**తక్కువ పెట్టుబడి, ఉత్తమ పద్ధతులు**

- బిందు సేద్య పద్ధతిలో నీటి పారుదల వలన తక్కువ నీటిని సమర్ధంగా వినియోగించుకొనుట
- ఎక్కువ కొమ్మలు వచ్చినపుడు కొన్ని కొమ్మలను కత్తిరించడం వలన మిగిలిన కొమ్మలు బలంగా ఎదుగుతున్నాయి
- కొమ్మకు పిందెలు ఎక్కువగా కాస్తే, తగు మాత్రమే ఉంచి మిగిలిన పిందెలను తెంచి, మిగిలిన కాయలకు పూర్తిగా పోషక పదార్థాలను అందించడం
- నిరంతర పర్యవేక్షణ వలన రోగాలను ఆదిలోనే గుర్తించి, నివారణ చర్యలు గైకొనడం వలన తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- బయటి నుండి వచ్చే దోమలు, ఈగల బారిన పడకుండా కొద్దిగా పక్వానికి వచ్చిన కాయలకు తొడుగులను అమర్చుట
- ప్రతి కాయకు తొడుగులు అమర్చుట వలన దోమలు, ఈగల బారిన పడకుండా కాయలను రక్షించడమే కాక కాయకు కాయకు రాపిడి వలన సంభవించే నష్టాన్ని

కూడా నివారించవచ్చు.

- కాయకు తొడుగులు అమర్చుట వలన క్రిమి కీటకాలు నుండి కాయలకు ఎటువంటి హానీ వుండదు కాబట్టి క్రిమి సంహారక మందులు చల్లే అవసరం వుండదు. ఫలితంగా క్రిమిసంహారక మందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన జామకాయలను వినియోగదారులకు అందించవచ్చు.



- సాధారణంగా గాలి వలన కాయలు రాచుకొని మచ్చలు వస్తాయి. కానీ ఈ తొడుగుల వలన ఆ రాపిడి నుండి ఉపశమనం కలిగి మన్నిక గల జమ కాయలను పండించవచ్చు.

**మార్కెట్ హామీ**

నారాయణరెడ్డి గారి పొలంలో పండే జామకాయలు దాదాపు 95 శాతం నాణ్యమైనవే. అందువలన జామ వ్యాపారస్తులు తోట దగ్గరకే వచ్చి కొనడానికి అడుగుతున్నారు. కాని నారాయణరెడ్డి గారు మాత్రం తోటను లీజుకు ఇవ్వకుండా తనే కూలీల ద్వారా కాయలను తెంపి బాక్సులలో నింపి బెంగలూరుకు పంపుతున్నారు. అక్కడ చంద్రశేఖర్ తన స్నేహితుల సహాయంతో వాటిని విక్రయిస్తున్నారు. సమయాన్ని బట్టి టోకుగా కిలో జామ కాయలు 60 నుండి 100 రూపాయల వరకు అమ్ముడవుతున్నాయి. నిరంతరం గిరాకి వుండడం వలన జామకాయలకు మంచి మార్కెట్ వుందని, సగటున ఎకరానికి రూ. 50 వేల ఖర్చుతో లక్ష రూపాయలు ఆర్జించ వచ్చని చంద్రశేఖర్ తెలుపుతున్నారు.

**కూలీలకు ఉపాధి**

వివిధ రకాల యాజమాన్య పద్ధతులను ఆచరిస్తున్నందు వలన రోజుకు దాదాపు 10మంది వరకు సగటున నెలకు కనీసం 150 పని దినాలు కల్పించుట వలన భూమిలేని కూలీలకు తగిన ఉపాధి లభిస్తున్నది.

**నేర్పుతున్న పాటాలు**

- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన పంట యాజమాన్య పద్ధతులను ఆచరించడం
- స్థానిక మార్కెట్ మీదనే ఆధారపడకుండా ఇతర నగరాలలోని మార్కెట్‌లను అందిపుచ్చుకోవడం
- ఇతర ప్రాంతాలలోని కొత్త వంగడాలను సాగు చేయడం
- నేర్చుకున్న పాఠాలను ఇతరులకు చెప్పడమే కాకుండా మన పొలంలో పాటించడం
- జామకాయలకు ధర తగ్గినా కూడా రైతుకు కనీస పెట్టుబడి వస్తుంది, నష్టం వుండదు.

నారాయణరెడ్డి గారి పొలంలో చేపట్టిన పంట యాజమాన్య పద్ధతులను గ్రామ రైతు సమాఖ్య, మండల రైతు ఉత్పత్తి దారుల సంస్థ సమావేశాలలో చర్చించి ఇతర రైతులకు తెలిజజేయడం జరుగుతున్నది. రైతు ఉత్పత్తి దారుల సంస్థల ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మరిన్ని ఉత్తమ యాజమాన్య పద్ధతులను ఆచరిస్తూ వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతామని నారాయణరెడ్డి గారు తెలిపారు.

నిరంతరం టమాట పంట పండించుట కే పరిమితమైన రామసముద్రం రైతులతో పాటు ఇతర ప్రాంతాల రైతులు మాలేనత్తం గ్రామ రైతు శ్రీ నారాయణ రెడ్డి, అతని కుమారుడు శ్రీ చంద్రశేఖర్‌ల మాదిరిగా కొత్త ఆలోచనలను ఆచరిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అధిక ఆదాయం అందించే పంటలను పండిస్తారని ఆశిద్దాం. ■

హితోపదేశాలు ఎన్నయినా సులువుగా చేయవచ్చు, కాని తన లోపాలు ఒప్పుకోవడమే కష్టం

# అధిక దిగుబడినిచ్చే కొత్త వరి వంగడం ఎంటీయూ 1290

ఎంటీయూ 1010కి ప్రత్యామ్నాయంగా 'ఎంటీయూ 1290' అనే నూతన వరి వంగడాన్ని పశ్చిమ గోదావరి జిల్లా 'మార్టేర్ వరి పరిశోధనా సంస్థ' శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేశారు. మొదటి సంవత్సరం చిరుసంచుల దశలో ఉన్న వరి రకం ఇది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేటలో కొప్పుల సత్యనారాయణ అనే రైతు. తన పొలంలో 'ఎంటీయూ 1290' వరి పంటను సాగు చేసి అధిక దిగుబడి సాధించారు.

సత్యనారాయణ సాగు చేసిన వరి పంటలను పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ వంగడం గురించి సత్యనారాయణ కొన్ని విషయాలు వెల్లడించారు. ఈ ప్రాంత రైతులు దొడ్డు రకాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఈ తరుణంలో ఎంటీ యూ 1010కి బదులుగా ఎంటీయూ 1290 అనే వరి వంగడాన్ని మార్టేర్ వరి పరిశోధనా సంస్థ ఉత్పత్తి చేసి, సాగు చేసేందుకు అభ్యుదయ రైతులకు ఇచ్చింది.

### మేలు రకాల విత్తనాలతో దిగుబడి ఎక్కువ

*రైతులు మేలు రకాల విత్తనాలను ఎంపిక చేసుకొని పంట సాగులో వాడుకోవాలి. విత్తనాల తయారీలో బ్రీడర్, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తున్నా. పొలంలో మేలైన వరివంగడాలను తీసుకొని, సంకరణం చేసి, అందులో మేలు రకాన్ని తీసుకొని, విత్తనం తయారు చేస్తున్నా. ఒక రకం విత్తనం తయారు కావాలంటే సుమారు 6 నుంచి 7 ఏండ్లు పడుతుంది. ఇంకా నూతన వరి విత్తనాలు తయారు చేయాలనేది నా ఆలోచన. పశ్చిమగోదావరి జిల్లా మార్టేర్ వరి పరిశోధనా స్థానం వారు ఇచ్చిన ఎంటీయూ 1290 అనే వరి విత్తనాన్ని పండించా. అధిక దిగుబడి వచ్చింది. మరిన్ని వివరాల కోసం రైతులు తనను 9908608696 నెంబర్‌లో సంప్రదించవచ్చు.*

– కొప్పుల సత్యనారాయణ

కాగా, తాను ఈ వరి రకాన్ని సాగు చేసి అధిక దిగుబడి సాధించినట్లు తెలిపాడు. వానకాలం, యాసంగికి అనుకూలమైన ఈ రకం ఇది. ప్రస్తుతం ఈ రకం పంట దోమ పోటును తట్టుకుని, చౌడు నేలలో సైతం అధిక దిగుబడి వస్తుందన్నారు.



చేతికి వచ్చే సమయంలో ప్రకృతి విపత్తులకు తట్టుకునే ఈ రకాన్ని మార్టేర్ వ్యవసాయ పరిశోధనా స్థానం వారు తయారుచేసినట్లు తెలిపాడు. అనేక ఆటుపోట్లను తట్టుకునే 1290 ఈ వరి వంగడం తొలి ఏడాది విజయవంతమైనట్లు తెలిపారు. దోమపోటును తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చిందన్నారు. *పంట కాలం :* వానకాలంలో 115 – 120 రోజుల పంట కాలం. యాసంగిలో 120 –125 రోజుల పంట కాలం. ఉల్లి కోడు తట్టుకుంటుంది. అగ్గితెగులు రాదు. నత్రజని తక్కువ అవసరం. తక్కు వ ఎరువులు వాడుకోవాలి. మెడవిరుపును తట్టుకుంటుంది.

ప్రత్యేక లక్షణాలు : దొడ్డుగింజ రకం. అధిక బరువు తూగే గుణం కలిగి ఉంటుంది. పొడవైన కర్రలు కలిగి ఉండి, 10 నుంచి 13 పొడవైన గొలుసులు కలిగి ఉంటుంది. గింజ రాలే గుణం తక్కువ కలిగి ఉంటుంది. ఒక్కో గొలుసు సుమారు 250 నుంచి 300 గింజలు కలిగి ఉంటుంది. వర్షాకాలం సాగులో తక్కువ నత్రజని వినియోగం. వరి మొక్క 1010ను పోలి ఉంటుంది.

సాగు విధానం: ఒక ఎకరానికి 25కిలోల విత్తన మోతాదు అవసరం. వరి నాటు నారు పోసిన 20 రోజుల

నుంచి 30 రోజుల్లో నాట్లు వేసుకోవాలి. దిగుబడి: ఎకరానికి సగటున వర్షకాలంలో 26 నుంచి 28 క్వింటాళ్లు దిగుబడి, యాసంగిలో 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఆరుగాలం రైతులు పండించిన పంట ప్రకృతి విపత్తుల కారణంగా చేతికందకుండాపోతుంది. అందుకే వీటిని తట్టుకునే ఎంటీయూ 1290 అనే వరి వంగడాన్ని ఉత్పత్తి చేశారు.

**సొంతంగా విత్తనాల తయారీ**

రైతు కొప్పుల సత్యనారాయణ మాట్లాడుతూ పలు గ్రామాల రైతులు విత్తనాల ఎంపికలో సరైన అవగాహన లేక అధిక దిగుబడి సాధించలేకపోతున్నారని అన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంటీయూ 1290 వరి రకాన్ని రైతులు సాగు చేసుకొని అధిక దిగుబడి సాధించవచ్చని సత్యనారాయణ తెలిపాడు.

ముఖ్యంగా మన రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలకు ఈ వంగడం అనుకూలం. అని తెలిపాడు. అయితే ఎక్కువ మొత్తంలో కాకుండా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఈ రకాన్ని సాగు చేయాలి. కొంతకాలంగా తాను సొంతంగా విత్తనాలను తయారుచేస్తూ చుట్టుపక్కల రైతులకు అందిస్తున్నాని తెలిపాడు. వానకాలం, యాసంగి కాలానికి తన వద్ద ఉన్న వరి విత్తనాల గురించి వివరించారు.

**శాస్త్రవేత్తల సందర్శన**

సత్యనారాయణ తయారుచేస్తున్న వరి వంగడాలను పలువురు శాస్త్రవేత్తలు పరిశీలించారు. హైదరాబాద్‌లోని 'భారతీయ వ్యవసాయ వరి పరిశోధనా సంస్థ' కు చెందిన డాక్టర్ షేక్ ఎన్‌మీరా, డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ మదన్‌మోహన్ బీ జమ్మికుంట కృషి విజ్ఞాన వరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ రావు ఈ పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సత్యనారాయణ పంట పొలంలో 18 రకాల వరి వంగడాలను ఉత్పత్తి చేసేందుకు పంటల ప్రదర్శన చేపట్టారు.

(నమస్తే తెలంగాణా సౌజన్యంతో ...) ■

## పశువుల్లో బాక్టీరియా వ్యాధులు నివారణోపాయాలు

**గొంతువాపు:** పాస్టురెల్లా మల్టోసైడా అనే బ్యాక్టీరియా వల్ల గొంతువాపు వస్తుంది. ఒక్కసారిగా జ్వరం రావడం, నోటి చొంగ, ఊపిరి కష్టంగా ఉండటం లాంటివి చూపిస్తుంది. 24 గంటల్లో పశువు చనిపోతుంది. చలికాలంలో పశువులు దగ్గర దగ్గరగా ఉంటుంటాయి. అందువల్ల చొంగ ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాపించవచ్చు. ఇంతకుముందే టీకాలు వేయించుకొని ఉంటే గొంతువ్యాపు రాదు. ఇప్పుడు కూడా టీకా వేయించుకోవచ్చు. వైద్యం ఖరీదు కాబట్టి నివారణమేలు.

**పింక్ ఐ:** ఇన్‌ఫెక్చ్యువస్ బొవైన్ కెరెటో కంజెక్టువైటిస్ అనే వ్యాధికి పింక్ ఐ అని కూడా పేరు. దీని తీవ్రత వర్షాకాలంలో ఎక్కువైనప్పటికీ శీతాకాలంలోనూ వ్యాపిస్తుంది. మోరాక్సెల్లా బోవిస్ అనే బ్యాక్టీరియా వల్ల పింక్ ఐ సోకుతుంది. వ్యాధి బారిన పడి తేరుకున్న పశువుల ముక్కు రంధ్రాల ద్వారా ఈ బాక్టీరియా బయటకు వ్యాప్తి చెందుతుంది. త్వరగా వైద్యం మొదలు పెట్టడం, పశువైద్యుని సలహా మేరకు టెట్రాసైక్లిన్స్ గల ఆంటీబయోటిక్స్‌ని వాడాలి.

**ఫుట్ రాట్:** దీనినే గొర్రెల్లో వాడుక భాషలో కుంట్లు అంటారు. గిట్టలమధ్యవాచి,నొప్పిగాఉండి,పశువులు కుంటుతుంటాయి. ఫ్యూసోబ్యాక్టీరియమ్ నెక్రోఫోగమ్ అనే బ్యాక్టీరియా వలన కలుగుతుంది. చిత్తడి నేలల్లో పశువులను ఉంచినట్లయితే ఈ పరిస్థితి వస్తుంది. కాళ్ల మీద బరువు మోపలేకపోవడం, నొప్పి కనబరచడం, వాసన కలిగి ఉండడం, మేత మేయలేకపోవడం లాంటి లక్షణాలను పశువు చూపిస్తుంది. పశువులను పొడినేలల్లో ఉండడం, పెన్సిలిన్, సెప్టియోఫర్, టెట్రాసైక్లిన్ లాంటి యాంటీ బయోటిక్స్‌ను వాడాలి.

**కాఫ్ డిప్తీరియా/లారిన్‌జైటిస్:** ఇది కూడా ఫూసోబ్యాక్టీరియమ్ నెక్రోఫోరమ్ వల్లనే కలుగుతుంది. 3 నుంచి 18 నెలల వయసున్న దూడల్లో ఎక్కువగా కనబడుతుంది. జ్వరం, దగ్గు, రొప్పడం వంటి లక్షణాలు కనబడతాయి. పక్కపక్కనే ఉన్న పశువులకు సోకుతుంది. పశువైద్యుని సలహా మేరకు యాంటిబయోటిక్స్‌ను వాడాలి. ■

## సహాయ సరంజామా !




బత్తాయి పళ్ళు .... కర్బూజా




క్యారెట్ , పండ్ల కిట్




ఆహార పదార్థాలు, కూరగాయలు ; వేరుశనగ సేకరణ




వరిధాన్యం, కందుల సేకరణ




పశువుల దాణా సిద్ధం , గడ్డి పంపిణీ

## సహాయ దృశ్య మాలిక !



పెయ్యలపాలెంలో ....



పుంగనూరులో ....



గార్లదిన్నెలో ....



ఎమ్మిగనూరులో ....



పీలేరులో పండ్ల కిట్స్‌తో ప్రత్యేక బస్సులో ఇళ్లకు....

MAHILA SADHIKARATHA
RNI Reg.No: TELTEL/2003/16365
*Publicaton Date:01-05-2020; Posting Date: 05-05-2020*
Postal Reg: HD/1064/2018-20





సహాయ కార్యక్రమాలలో ముగ్గురు ఎం ఎల్ ఏలు ; నందికొట్కూరులో, వాయల్పాడులో, రామసముద్రంలో ....




ఒంగోలులో సహాయ కార్యక్రమాలు




తిరుపతిలో సహాయ కార్యక్రమాలు




ధరణి ఎఫ్ పి ఓ సహాయ కార్యక్రమాలు .... ధీశాలి ఎఫ్ పి సి సహాయ కార్యక్రమాలు

| బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి | ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089 |
|---|---|